పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 118 CHAIRMAN : K.KOTESWAR RAO(KKR) గురువారం 30-7-2026 పేజీలు 12 వెల 5/-

## ఈ-20తో వాహనాలకు పెద్దగా సమస్యల్లేవ్

**పాత బళ్లలోనూ ఇంజిన్ మార్చకుండానే వాడుకోవచ్చు**

**సమగ్ర అధ్యయనాల తర్వాతే చెబుతున్నాం: నితిన్ గడ్కరీ**



**న్యూఢిల్లీ, జూలై 29:మీడియా టుడే**
ఈ-20 పెట్రోల్ వాడటం వల్ల వాహనాల పనితీరు, మన్నికలో గణనీయమైన సమస్యలు ఏమీ ఉత్పన్నం కావని సమగ్ర అధ్యయనాల్లో గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పాత తరం వాహనాల్లో సైతం ఇంజిన్‌లో మార్పులు చేయాల్సిన అవసరం లేకుండానే ఈ-20 పెట్రోల్ వాడుకోవచ్చని నొక్కి చెప్పింది. ఈ-20 పెట్రోల్‌పై సభ్యులు వ్యక్తం చేసిన ఆందోళనలకు కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖల మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాజ్యసభలో ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ-20 వల్ల వాహనం నడపడంలోగానీ, స్టార్ట్ చేయడంలోగానీ ఇబ్బందులు రావని, వాహనంలోని లోహ, ప్లాస్టిక్ భాగాలకు సైతం నష్టం కలగదని అధ్యయనాల్లో తేలినట్టు చెప్పారు. మైలేజీ అనేది ఎలాంటి ఇంధనం అనేదానిపైనే కాకుండా అనేక ఇతర కారణాలపైనా ఆధారపడి ఉంటుందని ఆటోమొబైల్ తయారీదారులు, వాహనాల టెస్టింగ్ ఏజెన్సీలు స్పష్టం చేసినట్టు గడ్కరీ వివరించారు. ఐవోసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్), ఐఐపీ(ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం), ఎస్ఐఏఎం(భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం-డెహ్రాడూన్), ఏఆర్ఏఐ(ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్తంగా అధ్యయనం నిర్వహించి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు ఈ-20 పెట్రోల్ వాడటం వల్ల నష్టంలేదని నిర్ధారించినట్టు తెలిపారు.

## యాదాద్రిపై పార్టీతో చర్చిస్తే బాగుండేది



**న్యూఢిల్లీ, జూలై 29:మీడియా టుడే**
యాదగిరిగుట్ట దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై ప్రభుత్వ పెద్దలు పార్టీతోనూ చర్చిస్తే బాగుండేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. 'యాదగిరిగుట్ట దేవస్థానాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రైవేట్ భాగస్వామ్యం ఉంటే వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నది సీఎం ఆలోచన కావచ్చు. ఆయన ఆలోచనను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. అయితే, పాలకమండలి కమిటీ ఏర్పాటు కోసం పార్టీతోనూ చర్చించి ఉంటే బాగుండేది' అని అభిప్రాయపడ్డారు.

తెలంగాణలో ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం మధ్య మెరుగైన సమన్వయం కోసం ఇకపై 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. పీసీసీ సమన్వయ కమిటీ ఏర్పాటు చేసిన నాలుగు నెలల తర్వాత కమిటీ తొలి సమావేశం బుధవారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగింది. ఇందులో సీఎం రేవంత్, మహేశ్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సమాశానికి కేసీ వేణుగోపాల్ అధ్యక్షత వహించాల్సి ఉండగా పార్లమెంటు సమావేశాల్లో ఆయన బిజీగా ఉండటంతో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షత వహించారు. గంటన్నరపాటు సాగిన సమావేశంలో రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వం మధ్య మరింత సమన్వయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో అనుసరించాల్సిన వ్యూహాలు, రాబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు.

## పాలమూరు, సీతమ్మ సాగర్‌కు లైన్ క్లియర్

**పర్యావరణ అనుమతుల సాధనకు మార్గం సుగమం**

**2017 మినహాయింపు నోటిఫికేషన్ చెల్లుబాటుకు సుప్రీం ఓకే**

**పనులు ప్రారంభించిన తర్వాతా అనుమతులు పొందవచ్చు**

**భవిష్యత్తులో మాత్రం ముందస్తు అనుమతులు తప్పనిసరి**

**2021 నాటి 'పోస్ట్ ఫ్యాక్టో' ఆఫీస్ మెమోరాండం చెల్లదు**

**కార్యనిర్వాహక ఉత్తర్వులతో చట్టాలను దాటవేయలేరు**

**సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. మంత్రులు ఉత్తమ్, తుమ్మల హర్షం**



**హైదరాబాద్, జూలై 29 మీడియా టుడే**
రాష్ట్రంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బ్యారేజీ, డిండి ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి రిజర్వాయర్‌ల పర్యావరణ అనుమతులు పొందడానికి మార్గం సుగమమైంది. ముందస్తు పర్యావరణ అనుమతులు (ఈఐ) లేకుండా పనులు ప్రారంభించిన ప్రాజెక్టులు.. ఆ తరువాత అనుమతులు పొందే విషయంలో సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించింది. ఇందుకు సంబంధించి 2017 నాటి మినహాయింపు నోటిఫికేషన్ చెల్లుబాటును సమర్థించింది. అయితే భవిష్యత్తులో ఇలాంటి పరిపాలన ఉత్తర్వులు ఇవ్వకుండా కేంద్రంపై నిషేధం విధించింది. ఈ మేరకు ప్రాజెక్టు పనులు ప్రారంభించిన తర్వాత అనుమతులు (ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో) మంజూరు చేసేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం (ఓఎం)ను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టం-1986, ఈఐఏ నోటిఫికేషన్-2006ను దాటవేస్తూ.. నిరంతరం అమల్లో ఉండేలా ఇటువంటి మినహాయింపు విధానాన్ని తీసుకొచ్చే అధికారం కార్యనిర్వాహక వర్గానికి లేదని తేల్చి చెప్పింది. తొలుత పర్యావరణ అనుమతులు తీసుకున్నాకే ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని స్పష్టం చేసింది. 'వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సీజేఐ, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. అయితే, ముందస్తు అనుమతి పొందే నిబంధనే ప్రాథమికమైనప్పటికీ.. అత్యంత అరుదైన, తీవ్రమైన ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్న పరిస్థితుల్లో చట్టంలోని సెక్షన్ 3 కింద పరిమిత కాలానికి ప్రత్యేక మినహాయింపు నోటిఫికేషన్లు జారీ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని పేర్కొంది.


## నిర్మల్‌లో 'కెరీర్ ప్రభోధ' ఐఐటీ - నీట్ - యూపీఎస్సీ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్ ప్రారంభం



**నిర్మల్ పట్టణం :(మీడియా టుడే)జూలై 29**
విద్యార్థులను ఉన్నత విద్యా లక్ష్యాల దిశగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన 'కెరీర్ ప్రభోధ' కోచింగ్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందిస్తున్న సంస్థ, ఇప్పుడు నిర్మల్‌లో తన సేవలను మరింత విస్తరించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంచశీల్ విద్యాసంస్థల చైర్మన్ ఎండీ అర్షద్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల అధ్యక్షుడు యాటాకరి సాయన్న, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్ గంగాధర్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహీధర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంపొందించుకొని, సరైన మార్గదర్శకత్వంతో ముందుకు సాగాలని సూచించారు. ఐఐటీ, నీట్, యూపీఎస్సీ వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షలకు అవసరమైన పునాది స్థాయి శిక్షణను విద్యార్థులకు అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే సంస్థ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు పాల్గొని సంస్థ నిర్వాహకుడు శ్రీకాంత్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## ఈ-కేవైసీకి రెండు రోజులే

**కరీంనగర్, జూలై 29 మీడియా టుడే**



రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. రేషన్ కార్డుల్లో పేర్లున్న సభ్యులంతా తప్పనిసరిగా చౌక ధరల దుకాణాలకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. నకిలీ కార్డుల ఏరివేతతో పాటు మరణించిన కుటుంబ సభ్యుల పేర్లు కార్డుల్లో తొలగించడంలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గడువు రెండు రోజులే ఉండగా రేషన్ దుకాణాలు మూసి ఉండటంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా చాలా మంది ఈ-కేవైసీ చేయించుకోలేక పోయారు. డీలర్లు దుకాణాలు తెరిచి ఉంటే తప్ప వంద శాతం ఈ-కేవైసీ వందశాతం పూర్తి కాదు. ఆధార్ అప్‌డేట్ లేనివారికి ఈ-కేవైసీ కావడం లేదు. దీంతో జనం ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం ఈ-కేవైసీని మరికొన్ని రోజులు పొడిగించాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు.

## బలమైన కూటమికి బొద్దింకల ప్రణాళిక!

**మోదీ సర్కారుకు వ్యతిరేకంగా విస్తృత కూటమి**

**రైతులు, యువత, విద్యార్థులతో కలసి ఉద్యమిస్తాం**

**సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా**

**రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ నేతల సమాలోచనలు**



**న్యూఢిల్లీ, జూలై 29: మీడియా టుడే**
రైతులు, యువత, విద్యార్థులతో విస్తృత కూటమిని ఏర్పాటు చేసి, కేంద్రంలోని మోదీ సర్కారుకు వ్యతిరేకంగా మలి విడత ఉద్యమానికి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సమాయత్తమవుతోంది. ప్రముఖ రైతు నేత రాకేశ్ టికాయత్‌తో సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా తదితరులు బుధవారం ఢిల్లీలో సమాలోచనలు నిర్వహించారు. భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) సభ్యులు కూడా ఇందులో పాల్గొన్నారు. విద్యార్థులపై కేసుల ఉపసంహరణ విషయంలో టికాయత్ మద్దతును ఈ సందర్భంగా సీజేపీ కోరింది. సమావేశం అనంతరం అశుతోష్ రంకా మీడియాతో మాట్లాడుతూ.. రైతు సోదరులు, యువత, విద్యార్థులతో పెద్ద కూటమి కట్టి, అన్ని వైపుల నుంచి మోదీ సర్కారుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇటీవలి నిరసనల సమయంలో విద్యార్థులపై నమోదైన కేసులను పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, అవమాన పూరిత, పరువుకు భంగం కలిగించే కంటెంట్‌ను తొలగించాలంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని సీజేపీ తప్పుబట్టింది. పాలకులను ప్రశ్నించే హక్కు పౌరులకు ఉంటుందని పేర్కొంది. ఆన్‌లైన్‌లో విమర్శలను శాంతిభద్రతలకు విఘాతంగా పరిగణించడం.. ప్రజా విమర్శలకు ప్రధాని అతీతమన్న సందేశాన్ని పంపడమేనని పేర్కొంది. నీట్‌పై ఉద్యమం సందర్భంగా ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ప్రధాని, ప్రభుత్వ యంత్రాంగానికి వ్యతిరేకంగా చేసిన పోస్టులు, వీడియో కంటెంట్‌ను తొలగించాలని ఢిల్లీ పోలీసులు ఎక్స్‌ను ఆదేశించడం గమనార్హం.

## ప్రియాంక క్షమాపణలు చెప్పాలి

**నిరాధార ఆరోపణలు చేసిన ఆమెను బహిష్కరించాలి**

**లోక్‌సభ స్పీకర్‌కు కేంద్ర మంత్రి జోషి ఫిర్యాదు**



**న్యూఢిల్లీ, జూలై 29: మీడియా టుడే**
కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కాంగ్రెస్ నేత ప్రియాంకపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో విద్యాశాఖను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించడంపై కాంగ్రెస్ నేతలు ప్రియాంక, రాహుల్ తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ప్రహ్లాద్ జోషి ఇటీవల రేపిస్టులను వెనకేసుకొచ్చారని, అలాంటి వ్యక్తికి ప్రధాని మోదీ విద్యాశాఖ బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. దీనిపై బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లోక్‌సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జోషి స్పందిస్తూ.. ప్రియాంక నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇష్టానుసారం మాట్లాడడం సరికాదని, ఆమె ఆరోపణలను తిరస్కరిస్తున్నానని చెప్పారు. ఆమెను సభ నుంచి బహిష్కరించాలని, తప్పనిసరిగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన స్పీకర్ చాంబర్‌కు వెళ్లి, ప్రియాంకపై ఫిర్యాదు చేశారు. ప్రియాంక కూడా తన వ్యాఖ్యలకు ఆధారాలు ఉన్నాయంటూ స్పీకర్‌కు తెలియజేసినట్లు సమాచారం. కాగా విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి సంబంధించి తాను అన్నీ నిజాలే చెప్పానని, తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యల్లో అన్‌పార్లమెంటరీ పదాలేవీ లేవని, దీనిపై పాలకపక్షం ఏమైనా చేసుకోవచ్చునని అన్నారు. ఇకపైనా నిజాలే మాట్లాడతానన్నారు. "మంగళూరు పబ్‌లో బాలికలపై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిని ప్రహ్లాద్ జోషి బీజేపీలో చేర్చుకున్నారు. కొన్ని గంటల తర్వాత ఆ వ్యక్తిని తొలగించినప్పటికీ ఆయనను పార్టీలో చేర్చుకున్నారనడానికి ఫొటోలు, వీడియోల రూపంలో సాక్ష్యాలు ఉన్నాయి. అవి నా దగ్గర ఉన్నాయి. ఇదొక మామూలు ఘటన కాదు. మహిళలపై ఆయన వైఖరికి నిదర్శనం" అని ప్రియాంక చెప్పారు.

మీడియా టుడే
గురువారం, జూలై 30, 2026

# విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుళ్లకు సీపీ సజ్జనర్ పరామర్శ



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జులై 29:** విధి నిర్వహణలో భాగంగా డ్రగ్స్ తనిఖీల సమయంలో గాయపడిన హెచ్-న్యూ కానిస్టేబుళ్లు ఎన్.మహేందర్ యాదవ్, ఎమ్.వంశీధర్‌లను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ పరామర్శించారు. లంగర్‌హౌజ్, ప్రశాంత్‌నగర్‌లోని ఆ కానిస్టేబుళ్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి.. వారి ఆరోగ్య పరిస్థితిని, క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విధి నిర్వహణలో వారు చూపిన తెగువను ప్రశంసించారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ.. ఎవరూ అధైర్యపడొద్దని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ పరామర్శలో టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ కూడా సీపీ వెంట ఉన్నారు.ఈ నెల 26న ఆబిడ్స్ తిలక్‌రోడ్డు ప్రాంతంలో డ్రగ్స్ సమాచారంతో 'హెచ్-న్యూ' బృందం తనిఖీలకు వెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఉన్న నీలిరంగు బలేనో కారు (ఒ+ 12 8766) డ్రైవర్.. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో వాహనాన్ని అత్యంత వేగంగా రివర్స్ చేస్తూ వారిపైకి దూసుకొచ్చాడు.ఈ ప్రమాదంలో కారు చక్రం కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో మరో కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరు కానిస్టేబుళ్లు సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇటీవల డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నారు .మరోవైపు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ప్రాణాంతక దాడికి పాల్పడి పరారైన కారు డ్రైవర్‌పై ఆబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యే ఉన్నత స్థితికి మార్గం: మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నలక్ష్మారెడ్డి (KLR)

బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ ) జులై 29న్యూస్

విద్య ద్వారానే పేదరికాన్ని జయించి ఉన్నత స్థితికి చేరుకోవచ్చని, ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని ఖూ= ట్రస్ట్ ఛైర్మన్, లీడ్ ఇండియా అధినేత, మాజీ ఎమ్మెల్యే, మాజీ లెక్చరర్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (ఖూ=) అన్నారు.రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖూ= ట్రస్ట్ -- లీడ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజంలో గుర్తింపు పొందాలన్నా, వ్యక్తిగతంగా ఉన్నత శిఖరాలకు చేరాలన్నా, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నా విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని సూచించారు.ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం ప్రతి విద్యార్థిలో ఉండాలని, లక్ష్యాన్ని నిరంతరం గుర్తుంచుకుని కృషి చేస్తే విజయం తప్పక సాధ్యమవుతుందని చెప్పారు.తెలుగు రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల్లో లక్షలాది మంది విద్యార్థులకు జీవన విలువలు, నైపుణ్య శిక్షణ అందిస్తున్న స్వచ్ఛంద సంస్థగా ఖూ= ట్రస్ట్ -- లీడ్ ఇండియా సేవలను పాఠశాల అధ్యాపకులు ప్రశంసించారు.లీడ్ ఇండియా కో-ఆర్డినేటర్ రంజిత్ మాట్లాడుతూ, విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్, సామాజిక విలువలు, కుటుంబ సభ్యుల పట్ల గౌరవం, మంచి వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.పేద విద్యార్థుల విద్యాభ్యాసం, నైపుణ్య శిక్షణ



కోసం అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఖూ= ట్రస్ట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# భారీ వర్షాల హెచ్చరిక.. జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాలి

## కలెక్టర్ అంకిత్- 36 గంటలు కీలకం.. వరద ప్రాంతాలపై ప్రత్యేక నిఘా



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,జూలై 29(మీడియా టుడే):** రానున్న 36 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు.అన్ని శాఖల అధికారులు తమ కార్యస్థానాల్లో అందుబాటులో ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి,అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని,నీటి ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, కలుషిత నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని చెప్పారు.విద్యుత్ అంతరాయం ఏర్పడినా ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణులను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# హరితహారం కార్యక్రమంలో భాగంగా ఉచిత మొక్కల పంపిణీ

**జూలై 29 మీడియా టుడే నల్లగొండ జిల్లా బ్యూరో** త్రిపురారం మండలం, లోక్యా తండా గ్రామపంచాయతీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక "తెలంగాణకు హరితహారం" కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ ధనావత్ జ్యోతి కాంతారావు నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణలో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్నిఅందించవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా మొక్కలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలం నాగరాజు, గ్రామ ఉపసర్పంచ్ నేనావత్ అంజి నాయక్, పాలక మండలి సభ్యులు వడ్యా రాజు నాయక్, నాగమ్మ, భాస్కర్ నాయక్, గ్రామ పెద్దలు స్వామి నాయక్, ధనావత్ జానూ నాయక్, కుర్ర స్వామి, ధనావత్ లాలు నాయక్, ధనావత్ కిషన్, గుగులోత్ పుల్లయ్య, దరావత్ స్వామి, కుర్ర వెంకన్న, గుగులోత్ తావు, ధనావత్ స్వామి నాయక్, మల్టీపర్పస్ వర్కర్లు రామావత్ హనుమంతు నాయక్, నేనావత్ హార్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# యోగా క్లబ్, మిర్యాలగూడ నిర్వహించిన గురు వందన కార్యక్రమం




**మీడియా టుడే( జులై 29)( నల్లగొండ జిల్లా బ్యూరో)**
గురువు స్థానం నిజంగా భాషకు అందని మహోన్నతమైనది. జ్ఞానజ్యోతిని వెలిగించే గురువు లేకపోతే జీవితం చీకటిమయమే. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వంటి అవతార పురుషులే గురువుల సన్నిధిలో విద్యను అభ్యసించారు. అలాంటి గొప్ప గురు-శిష్య సంప్రదాయాన్ని నేటికీ యోగా క్లబ్ మిర్యాలగూడ ఎంతో ఆదర్శంగా కొనసాగించడం అభినందనీయం.

**సత్కరించబడిన గురువులు:**

1. ప్రధాన గురుజి శ్రీ చీదళ్ళ వెంకటేశ్వర్లు అధ్యక్షులు2. శ్రీ సముద్రాల నాగభూషణం 3. శ్రీ కంచర్ల వెంకటేశ్వర్లు 4. శ్రీ కంచర్ల శ్రీనివాస్ రెడ్డి 5. శ్రీ మజ్జిగపు అంజి రెడ్డి 6. శ్రీ పంతులు నాయక్ ప్రతిరోజూ ఉదయం 4:30 గంటలకు నిద్రలేచి, సభ్యులందరికీ ఫోన్ చేసి యోగా సాధనకు ప్రోత్సహిస్తూ, ఆసనాలు, ప్రాణాయామం నేర్పిస్తూ, ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని తమ బాధ్యతగా భావించే ఈ గురువులకు ఎంత గౌరవం చేసినా తక్కువే.ఈ కార్యక్రమంలో శ్రీ పైడిమర్రి సురేష్ , శ్రీ కోలా సైదులు శ్రీ భీమ్లా నాయక్ శ్రీ మక్ల నాయక్ శ్రీ గుడిపాటి కోటయ్య శ్రీ వీరవెల్లి శ్రీనివాస్ శ్రీ కె. దయాకర్ రెడ్డి పాటు మొత్తం 46 మంది సభ్యులు పాల్గొనడం క్లబ్ ఐక్యతకు, క్రమశిక్షణకు, గురువుల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనం.

# గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జులై 29:**
పవిత్రమైన గురు పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువులందరికీ హృదయపూర్వక నమస్సుమాంజలులు తెలిపారు."గురు పౌర్ణమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మన జీవితాన్ని మలిచిన గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసే పవిత్రమైన రోజు. గురువు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, వారి బోధనలను ఆచరిస్తే ప్రతి అడుగూ విజయానికి నాంది అవుతుంది" అని పేర్కొన్నారు.తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని, లక్ష్యాన్ని అందిస్తారని అన్నారు. జీవితానికి దిశానిర్దేశం చేసి, అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించి మనలోని సామర్థ్యాన్ని గుర్తించి, క్రమశిక్షణ, విలువలు, ధైర్యం, ఆత్మవిశ్వాసం వంటి అమూల్యమైన సంపదను ప్రసాదిస్తారని పేర్కొన్నారు.




# భారీ వర్షాల ప్రవాహ దాటికి ముందస్తు చర్యలు చేపట్టిన లింగంపేట శ్రీనివాస్

**జగిత్యాల మీడియా టుడే- జూలై29**



జగిత్యాల బీజేపీ ఇన్చార్జ్ లింగంపేట్ శ్రీనివాస్ గారు భారీ వర్షా లతో ముంచెత్తుతున్న ప్రవాహ దాటి కి ముందస్తు సహాయ కార్యక్రమాలు ఏర్పాటు. ప్రజలు భారీ వర్షాల ప్రభావం లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జగిత్యాల 13 వార్డ్ కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్ గారు ప్రజల అప్రమత్త ప్రత్యేక ఏర్పాటు దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్య తీసుకోవాలని ఈరోజు ఉదయం 7 : 00 గంటల నుండి భారీ వర్షంలో జెసిబి తో అధిక నీటి ప్రవాహం పెరిగే చోట కాలవరులను చెత్తతో నిండిన ప్రదేశాలను తీసివేస్తూ ప్రజలకు వాహనదారులకు ప్రమాదాల కు గురై ఇబ్బందులు తలెత్తకుండా నివారణ చర్యల నిమితం భారీ వర్షంలో సహాయ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఇట్టి కార్యక్రమం దగ్గర ఉండి నిర్వహించడం జరిగింది. జగిత్యాల బీజేపీ ఇన్చార్జ్ లింగంపేట్ శ్రీనివాస్ గారు.

# గడ్డం ఎన్‌క్లేవ్ కాలనీలకు రూ.1.40 కోట్ల సీసీ రోడ్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కాలనీవాసుల ఘన కృతజ్ఞతలు



**బాలాపూర్ (మీడియా టుడే రిపోర్టర్ ) జూలై 29 న్యూస్**
మహేశ్వరం నియోజకవర్గంలోని గడ్డం ఎన్‌క్లేవ్ ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3 కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 1.40 కోట్లు మంజూరు చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికు కాలనీవాసులు ఘనంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రముఖ నాయకుడు రామిడి రామిరెడ్డి కాలనీలను సందర్శించి స్థానికులతో సమావేశమయ్యారు. సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవను ఆయన కొనియాడారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, కాలనీ పెద్దలు, స్థానికులు ఎమ్మెల్యేకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ "థ్యాంక్యూ సబితమ్మ" అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫేజ్-1 అధ్యక్షులు రాకేష్ రెడ్డి, ఫేజ్-2 అధ్యక్షులు నరసింహన్న, ఫేజ్-3 అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ అధ్యక్షులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, పెద్దలు మరియు అధిక సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా అల్మాపురి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి



**బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ )జూలై 29 న్యూస్ :**
గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గంలోని రామకృష్ణపురం డివిజన్ పరిధిలోని అల్మాపురి సాయిబాబా ఆలయంలో టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా సాయిబాబా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి హారతులు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీకి చెందిన తలాటి రమేష్, డివిజన్ అధ్యక్షులు ధనరాజ్ గౌడ్, ముప్పిడి లింగస్వామి గౌడ్, జ్ఞానేశ్వర్ యాదవ్, యాదవ్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, రాజు, జంగారెడ్డి, కృష్ణారావు, ఆలయ ప్రధాన అర్చకులు జయంత్, సంతోష్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# నూతన కాంగ్రెస్ అధ్యక్షులకు ఘన స్వాగతం.. దేప భాస్కర్ రెడ్డిని కలిసిన నాయకులు



**బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ ) జూలై 29 న్యూస్,** మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు టీపీసీసీ మెంబర్, సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ చిలుక ఉపేందర్ రెడ్డి గారు, రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పున్న గణేష్ నేత గారు, ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ముప్పిడి లింగస్వామి గౌడ్ గారు దేప భాస్కర్ రెడ్డి గారిని కలిసి ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులను శాలువాలతో సత్కరించి దేప భాస్కర్ రెడ్డి గారు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.నూతన అధ్యక్షులు మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

### ప్రధాన అర్చకులకు ఘన సన్మానం.. ప్రత్యేక గురుపూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, అధికారులు, కమిటీ సభ్యులు



**అమీన్పూర్, జూలై 29 (మీడియాటుడే)**
పటాన్‌చెరు నియోజకవర్గంలోని బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, గురుపూజలు నిర్వహించి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు.వేడుకల్లో భాగంగా ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత గురువులకు అత్యున్నత స్థానం ఉందని, గురువులను దైవస్వరూపంగా భావించి ఆరాధించడం మన హైందవ సంప్రదాయమని పేర్కొన్నారు. గురువులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు కలిసి ప్రధాన అర్చకులు శ్రీ రాధాకృష్ణ గారిని ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు పొందారు. అలాగే ప్రహ్లాద్ ఆధ్వర్యంలో గురుపూజ నిర్వహించి స్వామివారి ప్రత్యేక ఆశీర్వచనాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు గురువుల ఆశీస్సులు, స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు




**ములుగు జిల్లా ఏటూరునాగారం జులై29(మీడియా టుడే)**
ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలందరూ తీవ్ర అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారు ఒక ప్రకటనలో కోరారు.వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రజలు ముందస్తు ఆరోగ్య మరియు భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గారు ప్రజలకు పలు సూచనలు చేశారుకాచి చల్లార్చిన నీరే తాగాలి: వర్షాల వల్ల తాగునీరు కలుషితమై రోగాలు వచ్చే ప్రమాదం ఉంది.మిషన్ భగీరథ నీరైనా సరే: ప్రతి ఒక్కరూ నీటిని బాగా మరిగించి, చల్లార్చుకుని మాత్రమే తాగాలి.విద్యుత్ ప్రమాదాల పట్ల అలర్ట్: తడిసిన కరెంట్ స్తంభాలు, వైర్లు, ఇతర విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి.ముందస్తు జాగ్రత్తలు ముఖ్యం: ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలు ఇళ్ల వద్దే సురక్షితంగా ఉండాలి.సిబ్బందికి సహకరించాలి గ్రామాల్లో పారిశుధ్యం, అత్యవసర సేవల కోసం గ్రామపంచాయతీ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలి.ఏ చిన్న సమస్య ఉన్నా తక్షణమే గ్రామపంచాయతీ సిబ్బందిని సంప్రదించాలని సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు గారు కోరారు

# వరుణుడి కరుణ: కురుస్తున్న భారీ వర్షాలు.. జోరుగా వరి నాట్లు



**ములుగు జిల్లా కేంద్రం జులై29(మీడియా టుడే)**
గత కొద్ది రోజులుగా ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక, తీవ్రమైన కరవు పరిస్థితులతో జిల్లాలోని రైతన్నలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడు వర్షం పడుతుందా అని ఆకాశం వైపు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. అలాంటి తరుణంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై, వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి.రాత్రి నుండి జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ అద్భుతమైన వానతో అన్నదాతల గుండెల్లో ఆనందం వెల్లివిరిసింది. వరుణ దేవుడు తమను కరుణించాడంటూ రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.జోరందుకున్న వ్యవసాయ పనులుఈ భారీ వర్షం పడటంతో జిల్లా కేంద్రం చుట్టుపక్కల ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఒక్కసారిగా వేగం పుంజుకున్నాయి. రైతులు ఉత్సాహంగా తమ పొలాల్లోకి దిగి, సంప్రదాయబద్ధంగా లాగాకరంతో వరి నాట్ల ప్రక్రియను ప్రారంభించారు.కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, వర్షపు కోట్లు (రైన్‌కోట్లు) ధరించి మరీ రైతులు, కూలీలు ఉమ్మడిగా వరి నాట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. చేలన్నీ పచ్చటి వరినారుతో, నీటితో కళకళలాడుతున్నాయి. 'చాలా రోజుల తర్వాత భూమి తడిసిందని, ఈ వర్షం తమ పంటలకు ప్రాణాధారమని' పొలాల్లో పనులు చేస్తున్న రైతులు ఎంతో సంతోషంగా మురిసిపోతున్నారు

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమన్వయంతో, పారదర్శకంగా వందశాతం పూర్తి చేయాలి

### రాజకీయ పార్టీల సహకారంతో ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలి

### ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి



**ములుగు జిల్లా జులై(మీడియా టుడే)**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమన్వయంతో, పారదర్శకంగా వందశాతం పూర్తి చేసి, ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి కోరారు.బుధవారం ములుగు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను బూత్ లెవల్ అధికారులు బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్‌ఏలు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.ఒక ఓటరుకు ఒకే ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు ప్రాంతాల్లో ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. రెండు ప్రాంతాల్లో పేర్లు ఉన్న ఓటర్లు తాము ఓటు కొనసాగించదలిచిన ప్రాంతాన్ని నిర్ణయించుకుని, సంబంధిత బీఎల్‌వో ద్వారా మరో ప్రాంతంలోని ఓటును తొలగించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, స్థల మార్పు, అవసరమైతే పోలింగ్ కేంద్రాల విలీనం, తొలగింపుకు సంబంధించిన ప్రతిపాదనలపై రాజకీయ పార్టీల సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా వెంకటాపూర్ మండల పరిధిలో సుబ్బక్కపల్లి, పెరకపల్లి, ములుగు మండల పరిధిలో చింతకుంట, జగ్గన్నపేట, ఏటూరునాగారం మండల పరిధిలో ఎలిశెట్టిపల్లి గ్రామాల్లో మొత్తం ఐదు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మూడు పోలింగ్ కేంద్రాల స్థలాలను వర్చడంతో పాటు నాలుగు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చనున్నట్లు వెల్లడించారు నియోజకవర్గ పరిధిలోని అన్‌మ్యాప్డ్, గైర్హాజరు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన, ద్వంద్వ నమోదైన ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేస్తామని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలు అందించాలని కోరారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు తమ పరిధిలో ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, పత్రాలను త్వరితగతిన పూర్తి చేసి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి భాస్కర్, సీపీఎం పార్టీ ప్రతినిధి రాజేందర్, బీజేపీ పార్టీ ప్రతినిధి రవీంద్రాచారి, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సుమన్ పాల్గొన్నారు.

# 4-వే వ్యర్థాల విభజనపై గ్రామపంచాయతీల్లో విస్తృత అవగాహన కల్పించాలి

### (స్థానిక సంస్థలు) అదనపు కలెక్టర్ సంపత్ రావు

**ములుగు జిల్లా జులై29(మీడియా టుడే)**
ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026 అమలులో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన 4-వే సెగ్రిగేషన్ డస్ట్‌బిన్‌లను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు బుధవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026 ప్రకారం అన్ని గ్రామపంచాయతీల్లో 4-వే వ్యర్థాల విభజనపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు ఎక్కువగా వచ్చే కలెక్టరేట్, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్, ఏరియా ఆసుపత్రి, ఎస్పీ కార్యాలయం, డీఎఫ్‌వో కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్, డీపీఓ కార్యాలయం, సఖి సెంటర్, డీఆర్‌డీఓ కార్యాలయాలకు 4-వే డస్ట్‌బిన్ సెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.గ్రామపంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను సమర్థవంతంగా అమలు చేసి, వ్యర్థాల విభజనను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య మాట్లాడుతూ వ్యర్థాలను నాలుగు విభాగాలుగా వేరు చేయాలని వివరించారు. పచ్చ బిన్‌లో తడి వ్యర్థాలు, నీలి బిన్‌లో పొడి వ్యర్థాలు, ఎరుపు బిన్‌లో శానిటరీ వ్యర్థాలు, నలుపు బిన్‌లో బ్యాటరీలు, ఈ-వ్యర్థాలు, ప్రమాదకర రసాయనాలు, వైద్య వ్యర్థాలు వంటి ప్రత్యేక



సంరక్షణ వ్యర్థాలను వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ రఫీక్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ షర్పునిసా తదితరులు పాల్గొన్నారు

# ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### చీకుపల్లి--పెద్దగొల్లగూడెం ఇసుక వాగు రోడ్డు పరిస్థితిని పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



**ములుగు జిల్లా వాజేడు జులై29(మీడియా టుడే)**
జిల్లా లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం వాజేడు మండలం చీకుపల్లి--పెద్దగొల్లగూడెం ఇసుక వాగు డైవర్షన్ రోడ్డు పరిస్థితిని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించి ప్రత్యామ్నాయ రహదారి పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని సంబధిత అధికారులను ఆదేశించారు.వాజేడు మండలాల పరిధిలో చీకుపల్లి--పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు దెబ్బ తినడంతో తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి--163పై వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలపడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వరద ప్రవాహం తగ్గిన అనంతరం ప్రత్యామ్నాయ రహదారిని అత్యవసరంగా పునరుద్ధరించి రాకపోకలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రస్తుత వరద ఉధృతి అధికంగా ఉండటంతో పైపులు దెబ్బతినకుండా డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వి నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. వరద ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్డును తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్పీ మనన్ భట్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాల్వ ఒడ్డు ఎస్సీ ఎస్టీ బీసీ షాపింగ్ కాంప్లెక్స్ ను తొలగిస్తే ప్రత్యామ్నాయం చూపాలి.

**ఖమ్మం నగరం:** కాల్వ ఒడ్డు ఎస్సీ కాంప్లెక్స్ ను కేబుల్ బ్రిడ్జి ను దృష్టిలో ఉంచు కొని రోడ్ వెడల్పులో భాగం గా కూల్చి వేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ వారు నోటీస్ లు ఇచ్చారు. తిరిగి మున్సిపాలిటీ వారు కట్టించి మళ్ళీ మీకే ఇస్తామన్నారు. ఈ విషయమై కలెక్టర్ కి, ఈ.డి కి తెలుపుకున్నాముఅందుకు సంబంధించి హామీగా ఎటువంటి ఆర్డర్ కాపీ ఇవ్వలేదు. ఈ విషము కాల్వొడ్డు కాంప్లెక్స్ లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ లబ్ధిదారులు ప్రెస్ మీట్ ద్వారా తమ బాధను తెలియజేసు కున్నారు ఒక వేళ కూల్చి కట్టించిన పక్షంలో కింద షాప్ లలో మా షాప్ లకు మాకే ఇవ్వాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ గౌరవ అధ్యక్షులు గుంటేటి వీరభద్రయ్య మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ లో 62 మంది చిరు వ్యాపారస్తులు పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు ఈ తరుణంలో 1984లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అధికారి ఎస్ఆర్ శంకరన్ ఐఏఎస్ అధికారి నిరుద్యోగులైన వారికి జీవన భృతి కొరకు ప్రభుత్వ స్థలములో పది ఎనిమిది కొలతలతో షాపులు నిర్మించి నిరుపేదలైన అణగారిన కులాలకు షాపులు కేటాయించడం జరిగింది. ఇది సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం లో భాగంగా కొందరికి ఆటోలు, కారులు, ఇంటి జాగలు, వ్యవసాయ భూముల తోపాటు నిరుపేదల కొరకు షాపులు కేటాయించడం జరిగింది. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని నిరుపేద దుకాణదారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించి ఆదుకోవాలని ఖమ్మం జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తోగరు భాస్కర్, దేవపంగు సుదర్శన్, దాసరి శ్రీను,



చెరుకుపల్లి నాగేశ్వరరావు, తగరం సుగుణమ్మ, కరిశే కమల, జిల్లపల్లి సుజాత, తెల్లూరి భాస్కర్, అర్చన జయమ్మ , లంబాడీ హక్కుల రాష్ట్ర నాయకులు భద్రు నాయక్ దళిత నాయకులు పాల్గొన్నారు.

# బండారుపల్లి రైతుకు అరుదైన గౌరవం

### జిల్లా స్థాయి 'ఉత్తమ రైతు' అవార్డు అందుకున్న ఈర్ల రమేష్



**ములుగుజిల్లా జులై29(మీడియా టుడే)**
వ్యవసాయాన్ని నమ్ముకుని, నిరంతర శ్రమతో సాగు రంగంలో సరికొత్త విధానాలు పాటిస్తున్న బండారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ రైతు ఈర్ల రమేష్ గారు జిల్లా స్థాయి "ఉత్తమ రైతు" అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగంలో ఆయన కనబరుస్తున్న ప్రతిభకు, నిరంతర కృషికి గాను అధికారులు మరియు ప్రజాప్రతినిధులు ఆయనకు ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో ములుగు జిల్లా కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్, ప్రముఖ నాయకులు రేవంత్ యాదవ్, వ్యవసాయ శాఖ అధికారి (గూూ) రవి, అలాగే సంధ్య, జ్యోతి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఒక సాధారణ గ్రామం నుండి వచ్చి జిల్లా స్థాయిలో ఇంతటి గొప్ప గుర్తింపు తెచ్చుకోవడం పట్ల వారు రైతు ఈర్ల రమేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కిసాన్ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ మరియు ఇతర ప్రముఖులు మాట్లాడుతూ.. "ఈర్ల రమేష్ గారు నిరంతరం శ్రమిస్తూ వ్యవసాయంలో ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆయన కష్టానికి తగిన గుర్తింపు లభించడం ములుగు జిల్లాకే ఎంతో గర్వకారణం" అని కొనియాడారు. రమేష్ గారు భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో ఉన్నత అవార్డులను అందుకోవాలని, సాగు రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని బండారుపల్లి గ్రామ ప్రజలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషులు మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు

మీడియా టుడే

గురువారం, జూలై 30, 2026

# కార్మికుల అన్‌ఫిట్ విషయంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆలోచించాలి

**2025--26 ఆర్థిక సంవత్సరం లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.**

**కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్‌లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలి.**

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన హెచ్ఎంఎస్ నేత సిద్దంశెట్టి సాజన్**



**మందమర్రి, జులై 29,మీడియా టుడే.**

సింగరేణి కార్మికుల అన్‌ఫిట్ సమస్యతో పాటు కార్మికులకు లాభాల్లో వాటా, సింగరేణి సంస్థ భవిష్యత్తు, కొత్త బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు విషయంలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి సాజన్ డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రిలో హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్మికుల అన్‌ఫిట్ విషయంలో మానవతా దృక్పథం అవసరం హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన బాయిబాట కార్యక్రమంలో ఇచ్చిన నిరవధిక నిరాహార దీక్ష అల్టిమేటం కారణంగానే సింగరేణి యాజమాన్యం మెడికల్ బోర్డు నిర్వహించిందని సాజన్ అన్నారు. అయితే మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికుల విషయంలో యాజమాన్యం మరింత మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.కాశీపేట-1 గనికి చెందిన వెంకటేశ్వర్లు అనే కార్మికుడు తన కాలును పూర్తిగా కోల్పోయినప్పటికీ ఆయనను ఫిట్‌గా ప్రకటించి, అండర్‌గ్రౌండ్ విధులకు బదులుగా సర్ఫేస్‌లో విధులు నిర్వహించాలని సూచించడం పట్ల సాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తీవ్ర శారీరక వైకల్యం ఉన్న కార్మికుడి పరిస్థితిని మానవతా కోణంలో మరోసారి పరిశీలించాలని ఆయన కోరారు.సింగరేణిలో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని వాస్తవికంగా, నిష్పక్షపాతంగా పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. కేవలం నామమాత్రంగా మెడికల్ బోర్డు నిర్వహించి కార్మికులను తిరిగి విధుల్లోకి పంపడం వల్ల వారి ప్రాణాలకు, ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే పరిస్థితి ఉండకూడదన్నారు. కార్మికుల శారీరక సామర్థ్యం, వైద్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న పనుల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్మికుల శ్రమతో పెరిగిన ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతకు తగిన లాభాల వాటా ఇవ్వాలి.సింగరేణి సంస్థ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభనష్టాల పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సాజన్ డిమాండ్ చేశారు.ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థ సుమారు 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి, 62 మిలియన్ టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసిందని ఆయన తెలిపారు. అదే విధంగా గతంలో సింగరేణిలో కార్మికుల ఉత్పాదకత సుమారు 5.5 టన్నులు ఉంటే, ప్రస్తుతం అది 7.5 టన్నులకు పెరిగిందని అన్నారు.సింగరేణి ఉత్పత్తి, డిస్పాచ్ పెరగడంలోనే కాకుండా కార్మికుల ఉత్పాదకత గణనీయంగా పెరగడంలో కూడా సింగరేణి కార్మికుల చెమట చుక్కలు, కష్టానికి, అంకితభావానికి, నిరంతర శ్రమకు ప్రధాన పాత్ర ఉందని సాజన్ స్పష్టం చేశారు. కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తూ సంస్థ ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతను పెంచారని, వారి శ్రమ ఫలితంగానే సింగరేణి సంస్థకు భారీ ఆదాయాలు, లాభాలు సమకూరుతున్నాయని అన్నారు.2024--25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 65 మిలియన్ టన్నుల డిస్పాచ్‌తో సింగరేణి సంస్థకు ?6,000 కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఉత్పత్తి, డిస్పాచ్, ఉత్పాదకతలో గణనీయమైన పనితీరు కనబరిచిన నేపథ్యంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాల వివరాలను యాజమాన్యం కార్మికుల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థకు ఎంత లాభం వచ్చింది? ఆ లాభాల్లో ప్రభుత్వానికి ఎంత వాటా? సంస్థ అభివృద్ధికి ఎంత కేటాయించారు? కార్మికుల సంక్షేమానికి ఎంత ఖర్చు చేస్తున్నారు? అనే అంశాలపై యాజమాన్యం పూర్తి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని సాజన్ కోరారు.గత ఆర్థిక సంవత్సరంలో లాభాల్లో 34 శాతం వాటాను కార్మికులకు అందించిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఈ ఏడాది కూడా కార్మికుల పెరిగిన ఉత్పాదకతను, వారి శ్రమను పరిగణనలోకి తీసుకుని గతం కంటే తక్కువ కాకుండా మరింత మెరుగైన లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మికుల ఉత్పాదకత పెరిగినప్పుడు లాభాల్లో వారి వాటా కూడా పెరగాలి. కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలను కార్మికులకు దక్కకుండా చేయడం ఏ మాత్రం న్యాయం కాదు. శాతం పేరుతో లాభాల వాటాను తగ్గించే ప్రయత్నం చేస్తే కార్మికులు, హెచ్ఎంఎస్ చూస్తూ ఊరుకోదని సాజన్ తెలియజేశారు కొత్త బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే కేటాయించాలి.సింగరేణి సంస్థను రక్షించుకోవాలంటే తెలంగాణలో కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాక్‌లను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని సాజన్ డిమాండ్ చేశారు.మణుగూరు పి కె ఓ సి -2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని కోరుతున్న సమయంలో వేలం నిర్వహించడం అన్యాయమని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఈ వేలంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన జెన్‌కో సంస్థ పాల్గొనడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు.రాష్ట్రానికి చెందిన సింగరేణి సంస్థకు పోటీగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని మరో సంస్థ వేలంలో పాల్గొనే పరిస్థితి రావడం సరైన విధానం కాదన్నారు. జెన్‌కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు.జెన్‌కో వేలంలో పాల్గొనకుండా చూడాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం జెన్‌కో పాల్గొనకుండా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇద్దరూ చర్చించుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.తాడిచర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన విధంగానే మణుగూరు పి కె ఓ సి -2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కూడా ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని సాజన్ డిమాండ్ చేశారు.సింగరేణి సంస్థ కేవలం ఒక బొగ్గు కంపెనీ కాదని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉందని ఆయన అన్నారు. సింగరేణి భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, యాజమాన్యంపై ఉందన్నారు.కార్మికుల హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, కార్మికుల ప్రయోజనాలు, సింగరేణి సంస్థ భవిష్యత్తు, తెలంగాణ ప్రజల హక్కులను కాపాడేందుకు హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని సాజన్ స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సుదర్శన్, కేంద్ర కార్యదర్శి నాగనవేణి హరీష్, ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నవీన్, జాయింట్ సెక్రటరీ నీరటి కార్తీక్, హర్షవర్ధన్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ గౌతం, శ్రావణ్, జబీర్, కోశాధికారి శ్రావణ్, కాశీపేట-1 ఫిట్ సెక్రటరీ ప్రీత్ పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి ఆటో యూనియన్ పట్టణ అధ్యక్ష పదవికాలపరిమితి ముగిసినది

**నేరెళ్ల వెంకటేష్ 11 మెన్ కమిటీ చైర్మన్ మరియు సభ్యులు**



**మీడియా టుడే.మందమర్రి, జులై 29,**

మందమర్రి పట్టణ 11 మెన్ కమిటీ సమావేశం చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి పొట్ట మధుకర్ జిల్లా అధ్యక్షులు హాజరైనారు. లెవెన్ మెన్ కమిటీ సభ్యులు మరియు చైర్మన్ చర్చించి ఇప్పుడు ఉన్నటువంటి ఆటో యూనియన్ మందమర్రి పట్టణ కమిటీ కాలపరిమితి ముగిసిందని హాజరైన 11 మెన్ కమిటీ సభ్యుల ఏక తీర్మానంతో ప్రకటించినారు. నేటి నుండి మళ్లీ ఆటో యూనియన్ మందమర్రి ఎన్నికలు నిర్వహించే వరకు ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసమై పూర్తి బాధ్యత 11 మెన్ కమిటీ సభ్యులు మరియు ఆపద్ధర్మ అధ్యక్షులు మొయ్య రాంబాబు ది ఉంటుందని తెలియజేశారు. మళ్ళీ ఎన్నికలు నిర్వహించే పూర్తి బాధ్యత లెవెన్ మెన్ కమిటీ దే ఉట్టుందని తెలియజేశారు.బేసలాలకు పోకుండా ఆటో కార్మికుల ఐక్యత కోసం హక్కుల సాధన కోసం విభేదాలు లేకుండా నాయకులందరూ కలిసి పని చేయాలని అందరు ఐక్యంగా ఉంటే ఎంత పెద్ద సమస్య అయినా పరిష్కరించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఆటో యూనియన్ అడక్ లెవెన్ మెన్ కమిటీ సభ్యులు సముద్రాల శ్రీనివాస్, రెడ్డి సతీష్, సూరం శ్రీనివాస్, బుక్కల సంతోష్, పంబాల శ్రీనివాస్, మాదాసు లింగమూర్తి, చొప్పరి లచ్చన్న, బొల్లం రమేష్ బొట్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం



**మందమర్రి, జులై 29,మీడియా టుడే.**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మంచిర్యాల బిజెపి ఎండోమెంట్ సెల్ జిల్లా కో కన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం మందమర్రి మండలం దుబ్బపల్లి సత్యనారాయణ స్వామి దేవాలయం ఆవరణలో గురుపూజోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువులు ఊట్ల వెంకట శాస్త్రి మిట్టపల్లి సత్యనారాయణ శాస్త్రి, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు దీక్షితులు గురు వందనం చేసి గురుపూజోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు గిర్నాటి జనార్దన్, మాజీ ఉపసర్పంచ్ దరవేని రవికుమార్, మిట్టపల్లి ప్రదీప్, ఎనగందుల సత్యం, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమంఅభివృద్ధిరెండుకళ్లుగాప్రజాప్రభుత్వంముందుకుసాగుతోంది

**అర్హులైనప్రతిపేదకుటుంబానికి దశలవారీగాఇందిరమ్మఇళ్లు**

**రూరల్.మండలంలోపలుఅభివృద్ధిపనులకుశంకుస్థాపనచేసిన మంత్రి పొంగులేటి**




**నేలకొండపల్లి జులై 29 మీడియా టుడే ప్రతినిధి**

ప్రజలఆశీర్వాదంతోఏర్పడిన ప్రజాప్రభుత్వంసంక్షేమం, అభివృద్ధి జోడెద్దులా,రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్,సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.బుధవారం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తో కలిసి ఖమ్మంరూరల్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.దాక్యా తండా గ్రామంలో రూ.1.41 కోట్ల వ్యయంతోమంగళగూడెందాక్యా తండా బీటీ రోడ్డు నిర్మాణ పనులకు,అనంతరంపల్లెగూడెం గ్రామంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుండి ఎన్.ఎస్.పీ.మీదుగా పల్లెగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూప్రజల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువని, పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం వల్లే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ స్థాయి వరకు చేరుతున్నాయని వివరించారు.రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున 9 రోజుల్లో 9200 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేశామని, వరి రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు అదనంగా రూ.500బోనస్.అందించామని అన్నారు.25లక్షల మంది రైతులకు21 వేల కోట్లరుణాలు.2 లక్షల వరకు ఉన్న రైతుల రుణమాఫీ అమలు చేసి రైతులపై ఉన్న ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలు, మద్దతుధరలకుమాలకుకూడాప్రభుత్వంవిస్తృతంగా అమలు చేస్తోందన్నారు.మహిళల సాధికారత కోసం ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని మంత్రి అన్నారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు.పేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మొదటి విడతలో సుమారు నాలుగున్నర లక్షల ఇళ్లు, రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు మొత్తం ఏడు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో ఇంకా మిగిలిన గ్రామాలకు ఇళ్లు మంజూరు చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి అన్నారు.గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తూచా తప్పకుండా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పీడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కర్బూజా కాయ మీద గురు శిష్యుల అనుబంధ చిత్రం

**600కోట్ల లిఖిత సంఖ్యను పూర్తిచేసి 1000కోట్లకు శ్రీకారం**



గజ్వేల్ జూలై 29(మీడియా టూ డే )

గురుపౌర్ణమి పురస్కరించుకొని కర్బూజా కాయ మీద గురుశిష్యుల అనుబంధానికి సంబంధించిన అద్భుత చిత్రాన్ని చిత్రించి తన గురుదేవులు స్వర్గీయ బీటుకూరి రాఘవాచార్యులు గారికి అంకితం ఇచ్చి గురుభక్తిని చాటుకున్నారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి దండ్రులు జన్మనిస్తే, జ్ఞాన భిక్షతో పునర్జన్మనిచ్చే వారే గురువన్నారు.గత 30సంవత్సరాల క్రితం భక్తుల కోసం మా గురుదేవుల ఆశీస్సులతో స్థాపించిదే శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ అన్నారు.ఇప్పటికి 600కోట్ల లిఖిత రామ నామాలను తెలంగాణ ఆంధ్రప్రదేశ్ అమెరికా లాంటి ప్రాంతాల నుండి లక్షల మంది భక్తులచే లిఖింపజేయించి 1000కోట్లకు శ్రీకారం చుట్టామంటే మా గురుదేవుల ఆశీస్సులే అన్నారు.

# డాక్టర్స్ కాలనీ డివిజన్‌లో విద్యార్థినులకు కెరీర్ కౌన్సిలింగ్ -- 35 మంది బాలికలకు విద్యా సామగ్రి పంపిణీ



బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ ) జూలై 29 న్యూస్

మహేశ్వరం నియోజకవర్గంలోని డాక్టర్స్ కాలనీ డివిజన్, వెంకటేశ్వర కాలనీ రోడ్ నెం.6లోని కమ్యూనిటీ హాల్‌లో "ఉజ్వల ప్రోఫెషనల్ సంస్థ ఆధ్వర్యంలో, జూఅశ్రీఅన్షుశ్రీ ప్రజ్ఞఫోండేషన్ సహకారంతో విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ & గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ గారు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోశ్వేరి గారు హాజరై విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యత, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సిన అవసరం, భవిష్యత్‌లో కెరీర్ అవకాశాలపై విలువైన సూచనలు చేశారు.కార్యక్రమంలో భాగంగా "ఉజ్వల ప్రోఫెషనల్ సంస్థ ఆధ్వర్యంలో 35 మంది బాలికలకు విద్యా సామగ్రిని అందజేసి వారి విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ జంగా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నహీం భాయ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అశ్విని, కమ్యూనిటీ ఆర్గనైజర్లు నాగమణి, శ్యామల, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శీతల పండుగ ఉత్సవాలు



**మిర్యాలగూడ, జులై 29 (మీడియా టుడే):**

మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాష్ నగర్, గణేష్ నగర్ 8వ వార్డులో గిరిజన సాంప్రదాయ శీతల భవాని పండుగ సతీ భవానీ పూజ వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఆంగోతు చక్రి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో కాలనీ వాసులందరూ ఎల్లవేళలా చల్లగా ఉండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ గిరిజన సాంప్రదాయ పద్ధతుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని శీతల భవానీ అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ చక్రి నాయక్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతికి నిలువెత్తు ప్రతీక అయిన ఈ పండుగను కాలనీ ప్రజలందరి సంక్షేమం కోసం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రామావత్ కమల్య నాయక్, శంకర్ నాయక్, జగన్, భాస్కర్, చిన్న బాలు, దకనా, ఎమ్.హరి, దశరథ, మధు, అనిల్, హపి, నరేందర్, ఆర్.హరి, ఎమ్.జగన్, రాజా, బిక్షపతి, చిన్నరాయుడు, పెద్దబాలు, చక్రి యువసేన, బివిఆర్ బ్రదర్స్, వార్డు ప్రజలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేలకొండపల్లిసాయిబాబామందిరంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



**నేలకొండపల్లి జులై29మీడియా టుడే ప్రతినిధి**

నేలకొండపల్లి గ్రామంలోని శ్రీ సాయిబాబామందిరంలో బుధవారంగురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగాఆలయాని కివిచ్చేసినభక్తజనానికి "పులిహోర తీర్థప్రసాదాలను వితరణచేశారు.?ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కనుమల్లపూడి రమేష్, నేలకొండపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మద్దినేని మహేష్, నేలకొండపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు,కమ్మరపూడి బద్రి,వీరందరూ స్వయంగా భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిన్న నిర్లక్ష్యం... పెద్ద ప్రమాదం!

**విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరి -ప్రజల ప్రాణ భద్రతే తొలి ప్రాధాన్యం**

**విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**విద్యుత్ భద్రతతోనే సురక్షిత జీవనం -వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు చెక్ పెట్టండి**

**విద్యుత్ భద్రతపై ప్రజలకు కీలక సూచనలు -తెగిన విద్యుత్ తీగలు కనిపిస్తే వెంటనే 1912కు సమాచారం ఇవ్వండి**

**వర్షాకాలంలో విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలని -ములుగు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి**

**ములుగు జూలై29(మీడియా టుడే)**
వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం అధికంగా ఉంటుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ములుగు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. బిక్షపతి సూచించారు.వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టే వైర్లు, తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లరాదని తెలిపారు. తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి వైరింగ్‌కు నాణ్యమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు.రైతులు వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు, పంపుసెట్లు వినియోగించే ముందు వాటి భద్రతను పరిశీలించాలని, విద్యుత్ లైన్ల కింద ఇనుప పైపులు లేదా స్ప్రింక్లర్ పైపులు ఎత్తేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాంతకమని హెచ్చరించారు.పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆడనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులను విద్యుత్ స్తంభాలు లేదా ట్రాన్స్‌ఫార్మర్లకు కట్టరాదని సూచించారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా చేతులతో తాకకుండా విద్యుత్ ప్రసారం చేయని వస్తువుతో వేరు చేసి వెంటనే వైద్య సహాయం అందించాలని తెలిపారు.విద్యుత్ లైన్ల సమీపంలో కొత్త నిర్మాణాలు చేపట్టేటప్పుడు భద్రతా దూరం పాటించాలని, విద్యుత్ చౌర్యానికి పాల్పడటం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. తెగిపోయిన విద్యుత్ తీగలు, విద్యుత్ లోపాలు లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపించిన వెంటనే ౧+చ్రీణజూ టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు.ప్రజల సహకారంతోనే విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, “విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండండి... సురక్షితంగా జీవించండి... సురక్షితంగా వ్యవసాయం చేయండి” అని ఆయన పిలుపునిచ్చారు వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండండి అని తెలియజేశారు.

## ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాల్లో

# పారదర్శకతకు ప్రత్యేక త్రైపాక్షిక ఒప్పందం తప్పనిసరి

**అగ్రిమెంట్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు**

**ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ కావాలి -జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**జనగామ జిల్లా మీడియాటుడే జూలై 29:**
జిల్లాలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా నియమాలు, జీతాల చెల్లింపులు, ఏజెన్సీల బాధ్యతలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకాలు సంబంధిత గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఆయా ఏజెన్సీలతో ఈ నెల 25వ తేదీలోగా అగ్రిమెంట్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.ఈ అగ్రిమెంట్ సాధారణ ఒప్పందం కాకుండా త్రైపాక్షిక ఒప్పందం రూపంలో ఉండాలని స్పష్టం చేశారు. ఇందులో సంబంధిత శాఖ మొదటి పక్షంగా, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రెండో పక్షంగా, జిల్లా కలెక్టర్, ఔట్సోర్సింగ్ కమిటీ ఛైర్మన్ మూడో పక్షంగా ఉంటారని తెలిపారు. ఈ విధానంతో ఉద్యోగుల హక్కులకు రక్షణ కల్పించడంతో పాటు ఏజెన్సీల బాధ్యతను మరింత పెంచడం లక్ష్యమన్నారు.అగ్రిమెంట్‌ను రూ.100 విలువ గల నాన్-జ్యూడీషియల్ స్టాంప్ పేపర్ విలువ గల బాండ్‌పై నమోదు చేయాలని సూచించారు. ఒప్పందంలోని నిబంధనలను ఏజెన్సీలు ఉల్లంఘించినట్లయితే, వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఒప్పంద నిబంధనల ప్రకారం తగిన చర్యలు కూడా అమలు చేస్తామని హెచ్చరించారు .జిల్లాలోని అన్ని శాఖాధిపతులు ప్రతి నెల ఒకటో తేదీన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వారి బ్యాంకు ఖాతాల్లో తప్పనిసరిగా జీతం తో పాటు ఈపిఎఫ్ , ఈఎస్ఐ కూడా సంబంధిత ఉద్యోగి ఖాతా లో జమ అయ్యేలా శాఖ అధిపతులు, ఏజెన్సీ యాజమాన్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు



ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో (8) ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 577 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖల్లో సేవలందిస్తున్నారని తెలిపారు. వీరి సేవా భద్రత, వేతనాల సకాలంలో చెల్లింపు, ఒప్పంద నిబంధనల అమలు, బాధ్యతాయుత పరిపాలనకు ఈ త్రైపాక్షిక ఒప్పంద విధానం దోహదపడుతుందని స్పష్టం చేశారు.

# పులుల సంరక్షణ సమాజంలో అన్ని వర్గాల బాధ్యత

**అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**




**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: జూలై 29**
పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. బుధవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఆమె పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె సభను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు.వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో “ప్రాజెక్ట్ టైగర్” ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని తెలిపారు.అడవులను కాపాడు కుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావిత రాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు.ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి “అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావి తరాలకు పచ్చని తెలంగాణను అందించాలి” అని మంత్రి దిశా నిర్దేశం చేశారు. అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని అందించారు. అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి సురేఖ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అటవీ దళాల సంరక్షణ ప్రధాన అధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్మెంట్) రత్నాకర్ జౌహారి, సి సి ఎఫ్ టి జి ఎస్ ఎఫ్ ఏ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సి సి ఎఫ్ ఎం క్షితిజ టైగర్ సెల్ రీసెర్చ్ సైన్సిస్ట్ అయాన్ సాదు, అమ్రాబాద్ ఫీల్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ డైరెక్టర్ శాంతారామ్ పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదు

**సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్**

**జనగామ జిల్లా కొడకండ్ల మీడియాటుడే జూలై 29:**
గ్రామంలో నీ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ వేయరాదని చెత్త డబ్బాల్లోనే వేయాలని గ్రామ సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ కోరారు. బుధవారం రోజు మండల కేంద్రంలో చెత్త సేకరణ , బహిరంగ వ్యర్థాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఇండ్లలో, ప్రార్థన స్థలాల్లో,ఇతర బహిరంగ ప్రదేశాల్లో తడి చెత్త, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాల సేకరణ, ప్రత్యేకంగా వేరు చేసిన వ్యర్థాలను వేరే వేరుగా డబ్బాల్లో పోగుచేసి జీపీ వాహనం వచ్చినపుడు ఇవ్వాలని కోరారు. ప్రజలు గ్రామ స్వచ్ఛత కోసం సహకరించాలని వర్ష కాలం నేపథ్యంలో దోమల నివారణ, అంటూ వ్యాధుల నివారణ కోసం, తాగు నీటి శుద్ధి వంటి కార్యక్రమాలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. వ్యక్తి గత శుభ్రత, పరిసరాల శుభ్రత ను అందరూ క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. కార్యక్రమం లో ఉపసర్పంచ్ ఎండీ షన్నా,



జీపీ కార్యదర్శి ఆంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ కాల చక్ర మహా యజ్ఞానికి సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి ఆహ్వానము

**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి జూలై 29**



శ్రీకృష్ణ కాలచక్రం మహా యజ్ఞ హోమ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి శ్రీ రామ పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం లో పాల్గొనాలని ఆహ్వానించడం జరిగింది.. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బీచని బాలకృష్ణ ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు వాస శేఖర్ మాజీ ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్ వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ఆఫీసర్ గుగ్గిళ్ళ శంకర్ కలిసి ఆహ్వాన పత్రిక అందించడం జరిగింది...

## మూడున్నర కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని కాపాడిన రెవెన్యూ అధికారులు

**జనగామ,జూలై 29, మీడియా టుడే**



చిల్పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 229లో 36 ఎకరాల పైన సీలింగ్ భూములు (ప్రభుత్వ భూములు) ఉన్నాయి. గత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల మూడు ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని భూమి కన్స్ట్రక్షన్స్ (రెడి టూ మిక్స్) వారు 2019 నుంచి ఈ ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ప్లాంట్ ను నిర్వహిస్తున్నారు.ఈ భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్న తర్వాత ప్రస్తుత జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు ఈ భూమిని ఈ నెల 20వ తేదీన ప్రభుత్వానికి స్వాధీనం చేసుకోమని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూమి తరిగొప్పుల, చిన్న పెండ్యాల ప్రధాన రహదారిపై ఉన్నందున మార్కెట్ విలువ రూ. మూడున్నర కోట్లపైనే ఉంది. ఈ విషయంపై చిల్పూర్ మండల ప్రజలందరూ కూడా హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా అక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## తెలంగాణ హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం, అధికారులు గౌరవించడం నేర్చుకోవాలి

**కోర్టు ఆదేశాలతో విభేదిస్తే అప్పీల్ చేయాలి కానీ వాటిని ఉల్లంఘించకూడదు**


**వి. రవికృష్ణ, న్యాయవాది డ సామాజిక కార్యకర్త**






**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జులై 29:**
తెలంగాణ హైకోర్టు ఇటీవల హైడ్రా న్ణ=ూూ వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ఎంతో గంభీరంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది అని వి.రవికృష్ణ (న్యాయవాది మరియు సామాజిక కార్యకర్త) అన్నారు. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ హైడ్రా కమిషనర్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని హైకోర్టు చీఫ్ సెక్రటరీని ఆదేశించడం ఒక సాధారణ విషయం కాదు. ఆ ఆదేశానికి దారితీసిన కారణాలను కూడా న్యాయస్థానం తన ఉత్తర్వుల్లో స్పష్టంగా నమోదు చేసింది అని అన్నారు.ఒక న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వం లేదా అధికారి విభేదిస్తే, చట్టం చూపిన మార్గం పైకోర్టును ఆశ్రయించడం. డివిజన్ బెంచ్, అనంతరం అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం రాజ్యాంగం కల్పించింది. అయితే కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా, అదే సమయంలో కోర్టు తప్పుదోవ పట్టించిందని లేదా తమ చర్యలే సరైందని బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం అని అన్నారు.హైడ్రా న్ణ=ూూ కమిషనర్ పలుమార్లు “ల్యాండ్ గ్రాబర్స్ 63 కంటెంప్ట్ కేసులు వేశారు, కోర్టును తప్పుదోవ పట్టించారు” అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అత్యంత బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి చేయాల్సినవా అనే ప్రశ్న తలెత్తుతోంది. కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసు అనేది కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పాటించనప్పుడు వస్తుంది. ఆ ఆదేశాలు తప్పని భావిస్తే వాటిని చట్టబద్ధంగా సవాలు చేయాలి. కానీ వాటిని ఉల్లంఘించి, అనంతరం కోర్టు తప్పుదోవ పట్టించిందని చెప్పడం సరైన విధానం కాదు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హైడ్రాను మరింత బలోపేతం చేస్తామని, కోర్టు అధికారాలపై వ్యాఖ్యానించడం కంటే ముందుగా కోర్టు తీర్పును గౌరవించి, అవసరమైతే చట్టబద్ధంగా అప్పీల్ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తించాలి అని అన్నారు. ఇటీవల ప్రభుత్వ సమాచార శాఖ (ఞూ=) అధికారిక సోషల్ మీడియా వేదికలో ఐలాపూర్ ప్రాంతంలో 860 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడిందని ప్రచురించింది. అయితే అదే భూమికి సంబంధించి న్యాయస్థానాల్లో వివాదాలు పెండింగ్‌లో ఉండగా, స్టేటస్ కో ఆదేశాలు అమల్లో ఉండగా, కోర్టు తుది నిర్ణయం రాకముందే దానిని ప్రభుత్వ భూమిగా ప్రకటించడం ఏ చట్టబద్ధమైన ఆధారంపై జరిగిందో ప్రభుత్వం ప్రజలకు వివరించాలి.అక్రమ నిర్మాణాల తొలగింపు అవసరమే. కానీ ఆ చర్యలు కూడా చట్టబద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా జరగాలి. బాధితులకు నోటీసులు ఇవ్వడం, వారి వస్తువులు తరలించుకునే అవకాశం కల్పించడం, అద్దెదారుల హక్కులను గౌరవించడం వంటి కనీస న్యాయ ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.నేను గత మూడు సంవత్సరాలుగా అమీన్పూర్, బీరంగూడ, శంభునికుంట తదితర ప్రాంతాల్లోని భారీ చెరువు ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు చేశాను. ముఖ్యంగా శంభునికుంట చెరువు శికం భూమిలో నిర్మించబడిన ఐదు అంతస్తుల వాణిజ్య భవనంపై చర్యలు తీసుకోవాలని కోరినప్పుడు, “మిగతా శాఖలను అడగండి” అనే సమాధానం మాత్రమే వచ్చింది. అదే సమయంలో ఇతర ప్రాంతాల్లో మాత్రం అత్యంత వేగంగా కూల్చివేతలు జరగడం ప్రజల్లో సమాన న్యాయం అమలవుతోందా అనే అనుమానాలకు దారితీస్తోంది.హైడ్రా వంటి సంస్థ చట్ట పరిపాలనను బలోపేతం చేయడానికి ఉండాలి కానీ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా వ్యవహరించకూడదు. భూ చట్టాలు, సాగునీటి చట్టాలు, మున్సిపల్ చట్టాలు, పట్టణాభివృద్ధి చట్టాల అమలులో న్యాయపరమైన అవగాహన, పరిపాలనా సమతుల్యత అత్యంత అవసరం.ఈ అంశాన్ని నేను ఏ వ్యక్తి లేదా ఏ ప్రభుత్వంపై వ్యక్తిగత వ్యతిరేకతతో ప్రస్తావించడం లేదు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం, చట్టం, న్యాయస్థానాల పట్ల గౌరవం ప్రతి ప్రజాప్రతినిధి, ప్రతి అధికారి చూపాల్సిన బాధ్యత. కోర్టు తీర్పుతో విభేదిస్తే చట్టబద్ధమైన అప్పీల్ చేయాలి; కానీ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం లేదా న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

# సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**మిర్యాలగూడ, జులై 29 (మీడియా టుడే):**
మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్ పేటలో వేంచేసి ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. గురు పౌర్ణమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణమంతా సాయి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయాన్నే బాబావారికి కాకడ హారతితో ప్రారంభించి, మూల విగ్రహానికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలను గోవింద్ పాండే, శైలేందర్ ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని వర్ణ రంజిత పూలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. దర్శనానికి విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని బాబావారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి శాలువాలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువు స్థానం అత్యున్నతమైనదని, షిరిడీ సాయిబాబా బోధించిన శ్రద్ధ-సబురి, మానవసేవే మాధవసేవ అనే మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ప్రజలందరికీ గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సాయిబాబాను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మంచుకొండ వెంకటేశ్వర్లు-నాగరత్నం, అధ్యక్ష కార్యదర్శులు గౌరు దయాకర్, నీలా పాపారావు, గౌరు సతీష్, కాతోజు బాల బ్రహ్మచారి గంధం సైదులు, సాంబశివరావు, శ్రీనివాస్-పద్మ , కౌన్సిలర్ కోటేశ్వరరావు, పెండ్యాల పద్మ, కటకం నాగరాజు, కీర్తి అశోక్, చంద్రారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## సాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు

**జనగామ జిల్లా కొడకండ్ల మీడియాటుడే జూలై 29:**



గురు పౌర్ణమి పర్వదినం ను పురస్కరించుకొని మండల కేంద్రంలో నీ సాయినాథుని ఆలయంలో బుధవారం రోజు వేదపండితులు నాగ దక్షిణ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్, ఆలయం నిర్వాహకులు కుందూరు రమేష్ రెడ్డి, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ సత్య సాయి బాబా మందిరంలో ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవాలు



**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి జూలై 29**
గురు పౌర్ణమి సందర్భంగా ఈ రోజు ఉదయం 6 గంటలకు ఓంకారం సుప్రభాతం నగర సంకీర్తన, 10 గంటలకు షిరిడి సాయి అభిషేకం 11 గంటలకు శ్రీ సత్య బాబా వారి వ్రతము నిర్వహించినారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వ్రతము అనంతరం భజన మంగళహారతి తీర్థ ప్రసాద వివరణ అన్న ప్రసాద సేవ నిర్వహించినారు తిరిగి సాయంత్రం 5:30 గంటలకు బాలవికాస్ చిన్నారుల చేత వేదము, సాంస్కృతిక కార్యక్రమాలు, భజన రాత్రి 8:30 గంటలకు బాలవికాస్ విద్యార్థిని విద్యార్థుల చేత స్వామి వారికి మహా మంగళహారతి తో కార్యక్రమాలు ముగుస్తాయి అని శ్రీ సత్య సాయి సేవ సమితి కన్వీనర్ సి.రమేష్ రెడ్డి తెలిపినారు

## 38 కేసుల్లో లభించిన 63.621 కిలోల గంజాయి, ఒక గంజాయి మొక్క దగ్ధం

### -కరీంనగర్ సిపి గౌస్ ఆలం






**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూలై 29 :**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 38 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63 కిలోల 621 గ్రాముల గంజాయి మరియు 1 గంజాయి మొక్కను ధ్వంసం చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. మానకొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదులగట్టెపల్లి గ్రామంలో ఉన్న వెంకటరమణ ఇన్సినేటర్‌లో పోలీస్ కమీషనర్ సమక్షంలో డ్రగ్ డిస్పోసల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ గంజాయిని దహనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ జి.వెంకటస్వామి ఇన్స్పెక్టర్లు రఫీక్, శ్రీలత,ఆర్ఐలు రజినీకాంత్ , శ్రీధర్ రెడ్డి అలాగే ఇన్సినరేటర్ ప్లాంట్ కు చెందిన తిరుపతి మరియు ప్రభాకర్ రెడ్డిలతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్

# లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

**-పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస**

**-ఎన్ఎస్పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరఫున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు.అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# నందీశ్వర మహారాజ్ కి ఘనంగా పాదపూజ



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూలై 29 :**
ఆర్మూర్ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ నవనాథ సిద్ధగుట్ట పై బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సిద్దులగుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మరియు భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయం, రామాలయం, దత్తాత్రేయ, దుర్గామాత, అయ్యప్ప ఆలయాలలో ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి సందర్భంగా సిద్ధిల గుట్ట ఆస్థాన మహారాజ్ నందీశ్వర మహారాజ్ కి భారత్ గ్యాస్ సుమన్ తిరుమల 29వార్డు కౌన్సిలర్ మహారాజ్ కి పంచామృతాలతో పాదపూజ అభిషేకాలు నిర్వహించి పూలు పండ్లు పట్టు శాలువాతో నూతన వస్త్రాలను అందజేసి స్వామీకి ఘనంగా సన్మానించి పూజలు చేసి మంగళహారతితో హారతి ఇచ్చారు. ఉదయం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని రామాలయంలో నిర్వహించి పాదపూజ చేయడం జరిగింది. ఈ పూజా అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్న ప్రసాదం భారత్ గ్యాస్ సుమన్ తిరుమల దంపతులు అంద చేయడం జరిగింది. భక్తులందరూ మహారాజు ని దర్శించుకుని తీర్థప్రసాద్ తీసుకుని మహారాజ్ ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బి. సుమన్, పిసి. గంగారెడ్డి, చరణ్ రెడ్డి, కోడిగేల మల్లయ్య, జిమ్మీ రవి, బట్టు శంకర్, అలిశెట్టి నరేష్, చందేష్, శ్రీనివాస్, ప్రసాద్ గౌడ్, హజారి సతీష్, కొంత మంజుల మురళి, భజన మండలి భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి వారితో పాటు సిద్ధగుట్ట సేవ సమితి భక్తులు పాల్గొన్నారు.

# కళ్లు లేని కబోధిలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు

### -ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , జూలై 29 :**
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్ల ముందు కదలాడుతున్నా ప్రతిపక్షాలకు కానరాక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని మానకూండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశమందిరంలో వివిధ గ్రామాల 99 మంది లబ్ధిదారులకు 31.92 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయని బీఆర్ఎస్, దానికి వంతపాడుతూ అంటకాగిన బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పథకాలపై తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గత పాలనలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసి చేతులు దులుపుకున్న విషయాన్ని విస్మరించిన గులాబీ నేతలు 2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల 2 లక్షల రుణమాఫీ పొందడంలో కొద్ది మంది రైతులకు ఆలస్యం జరిగిందే తప్ప మరో ఉద్దేశం కాదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం చేతకాని గత పాలకులు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగునా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు కోసం మోదీ ప్రభుత్వ సాయాన్ని కోరాలన్న సోయి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బేషజాలను పక్కనబెట్టి జనహితం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు మోడీని కలిసి లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ధరణి పేరిట జరిగిన అక్రమాలు అన్నీ,ఇన్నీ కావని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యుల పరమయ్యాయని,భూముల ఆక్రమణలు, కబ్జాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయాయని, వాస్తవాలను ఇప్పటికైనా గ్రహించి బట్టకాల్చి మీద వేసే విధానానికి గులాబీనేతలు స్వస్తిపలకాలని డాక్టర్ కవ్వంపల్లి హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పథకాల వల్ల ప్రతి కుటుంబం నెలకు 2500 రూపాయల మేరకు లబ్ధిపొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సోదాహరణంగా వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక అష్టకష్టాలకు, అన్యాయాలకు గురిచేయడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి పట్టంగట్టారన్నారు. ప్రజల ఆశలు,ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తూ రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నదని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రైతులు పండించిన వరి,మక్కజొన్న,సన్ ఫ్లవర్ తదితర పంటలను ప్రభుత్వం ఐకేపీ, సింగిల్ విండో వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయించడమే కాకుండా 24 గంటలకు రైతులకు డబ్బులు చెల్లించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కిలో సన్న బియ్యాన్ని 60 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పవన్ కుమార్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కొత్త తిరుపతిరెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, నోముల అనిల్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, లక్ష్మణ్, తుర్తి అరవింద్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలో 85 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి

**త్వరలో వంద శాతం పూర్తి కానున్న వనపర్తి జిల్లా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**




**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి సి రమేష్ రెడ్డి జూలై 29**

వనపర్తి జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 84.12 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో మొత్తం ఓటర్లు 2,75,570 కి గాను వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి వరకు 2,31,808 ఎన్యూమరేషన్ ఫారాలను 84.12 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుంద న్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న పోలింగ్ స్టేషన్లు, 2 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి రేషనలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4,5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్డీఓ టి. వినోద్ కుమార్, ఆర్డీఓ సుబ్రమణ్యం, సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిమండల అభివృద్ధిపై సమగ్ర సమీక్ష



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి జూలై 29**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం కల్వకుర్తి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సబ్ డివిజనల్ అధికారులతో కలిసి మండల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పరిపాలనా అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.మండలంలోని వివిధ గ్రామాల అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశంలో చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో ఆర్డీవో, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై సర్పంచ్ ప్రశ్నల వర్షం



**జగదేవ్‌పూర్, జూలై 29 ,(మీడియా టుడే):**

జగదేవ్‌పూర్‌లోనే యంగ్ ఇండియా స్కూల్‌ను ఏర్పాటు చేయాలని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగదేవ్‌పూర్‌లో ప్రభుత్వానికి 43 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నందున అక్కడే పాఠశాలను నిర్మిస్తే మండలంలోని పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.అలాగే కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్‌ను వెంటనే జారీ చేయాలని, ఎల్-3 జాబితాలోని అర్హులను ఎల్-1 జాబితాలోకి చేర్చాలని కోరారు. గ్రామాల్లో నిలిచిపోయిన ఎస్సీ సబ్‌ప్లాన్ పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గురు పౌర్ణమి పూజా యజ్ఞం ఘనంగా నిర్వహణ



**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , జూలై 29 :**

స్థానిక కరినగర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇ. మీ హైస్కూల్లో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, యజ్ఞం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురుపరంపర వైభవాన్ని చాటి చెప్పే ఈ పవిత్ర దినాన విద్యార్థులు, ఆచార్యులు కలిసి గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. గురు పౌర్ణమి ఆషాఢ పౌర్ణమి రోజున జరుపుకునే భారతీయ సంప్రదాయంలోని ప్రముఖ పర్వదినం.

ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, పులల శ్యామ్, డా. ఎలగందుల శ్రీనివాస్ యజ్ఞం లో పాల్గొనగా జ్యోష్యం అనుదీప్ వేద మంత్రోచ్చారణలతో యజ్ఞం నిర్వహించారు. భారతీయ సంస్కృతి, గురు-శిష్య పరంపర గొప్పతనాన్ని ప్రతిబింబించేలా గురుపూజ నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ దేశం, సమాజం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రార్థనలు చేశారు.ముఖ్య వక్త డాక్టర్ లెక్కల రాజభాస్కర్ రెడ్డి గురువు యొక్క గొప్పతనం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానాన్ని విశదీకరిస్తూ ప్రసంగించారు. గురువు కేవలం విద్యను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శి అని పేర్కొన్నారు. మన సంస్కృతిలో "గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వరః" అనే భావనకు ఉన్న విశిష్టతను వివరించారు. విద్యార్థులు గురువుల పట్ల వినయం, క్రమశిక్షణ, గౌరవ భావాలను పెంపొందించుకోవాలని, గురువులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. భారతీయ గురు-శిష్య పరంపర విశిష్టతను ఉదాహరణలతో వివరిస్తూ, గురు పూజ ద్వారా గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని అన్నారు. అనంతరం విద్యాపీఠం ప్రశిక్షణ వర్గలో ఉత్తీర్ణత సాధించిన ఆచార్యులందరికి ధ్రువీకరణ పత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ , ఆచార్యులు, విద్యార్థులు పాల్గొని గురువులకు పుష్పాంజలి ఘటించి వారి ఆశీర్వాదాలు పొందారు.

# ఇందిర మహిళా శక్తి యూనిఫారం కుట్టు కేంద్రం ప్రారంభం



**కోదాడ, జులై 29 (మీడియా టుడే)-:**

దొరకుంట గ్రామంలో ఇందిర మహిళా శక్తి యూనిఫారం కుట్టు కేంద్రంను బుధవారం ప్రారంభించిన సర్పంచి పాలకి సురేష్.అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాల కల్పన,మహిళా సంఘాల ఆధ్వర్యంలో వ్యాపారాలు, సూపర్ బజార్లు, రైస్ మిల్లులు వంటి ఆదాయ వనరుల ఏర్పాటు.గ్రామ స్థాయిలో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణం.కొన్ని ప్రాంతాల్లో మహిళా సంఘాల ద్వారా బస్సుల నిర్వహణ వంటి ఉపాధి అవకాశాల ప్రోత్సాహం చేస్తున్నాయి అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో మహిళా సంఘ బంధం సీసీ చిన్న, సీసీ పరిమళ రాణి, వివఓ షకీరా, లీలావతి, కుట్టు మిషన్ ఇంచార్జి లు సాజిద, ఫాతిమా, వినీత, సంఘ బంధశీ సభ్యులు రాజేశ్వరి, స్వాతి, నవ్య, పర్వీన్, షాహిన్, సల్మా, సుమయ సంఘ బంధం సభ్యులు పాల్గొన్నారు.

# సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శిగా సి.వై. పుల్లయ్య,



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి**

సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శిగా కామ్రేడ్ సి.వై. పుల్లయ్యను ఏకగ్రీవంగా నిన్న జరిగిన ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఎన్నుకున్నది. ఇప్పటి దాకా జిల్లా కార్యదర్శిగా కొనసాగిన కా॥ గోకినేపల్లి వెంకటేశ్వరరావు పై కమిటీల బాధ్యతల రీత్యా, కొంత అనారోగ్యం రీత్యా తను జిల్లా బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో సుదీర్ఘకాలంగా ఉ ద్యమంలో కొనసాగుతున్న, విద్యార్థి, యువజన, ప్రజా ఉద్యమాలలో 3 దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న కా॥ సి.వై. పుల్లయ్యను రాష్ట్ర బాధ్యుల సమక్షంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.అలానే జిల్లా కమిటీ సమావేశం జిల్లాలో రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితులను చర్చించింది. జిల్లాల ప్రజా ఉద్యమ నిర్మాణానికి అనేక కార్యక్రమాలు తీసుకున్నది.అలానే ఈ రోజు జరిగిన ప్రెస్మీట్లో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రామయ్య, అశోక్, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య, తదితరులు మాట్లాడుతూ...1) రేవంత్ రెడ్డి ప్రభుత్వం 3 సం॥రాల క్రితం ఇచ్చిన వాగ్దానం ప్రకారం వృద్ధాప్య, వితంతు తదితర పెన్షన్లు వెంటనే పెంచాలి. అలాగే వ్యవసాయ కార్మికులకు, ఆటో కార్మికులకు ఇస్తానన్న పెన్షన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది.2) కేంద్ర ప్రభుత్వం జంతర్ మంతర్లో లో, దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉద్యమంలో పాల్గొన్న వారిపై కేసులు పెట్టడం, అరెస్టులకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య. కేసులన్ని ఎత్తివేస్తామని ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలి. కేసులను వుపసంహరించుకోవాలి. అరెస్టులను ఆపాలి. అలానే ఉద్యమకారులపై విచక్షణా రహితంగా చేసిన అమానుష హింసాకాండపై స్వతంత్ర్య న్యాయమూర్తుల బృందంతో విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.3) రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటిని తక్షణమే విడుదల చేయాలి. బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో, కళాశాలల భవితవ్యంతో ఆడుకోవడం సరైంది కాదు, పాత బకాయిలు ఇస్తూనే, ఫీజు రీయంబర్స్మెంట్ ఏ ఏడాదికి ఆ ఏడాది ఇచ్చే విధానం పకడ్బందీగా అమలులోకి తీసుకురావాలి.4) రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించక పోవడం విద్యాశాఖపై వున్న నిర్లక్ష్యానికి నిదర్శనం. యూనివర్సిటీల నుంచి ప్రభుత్వబడుల దాకా తీవ్ర నిధుల కొరత, సమస్యలతో సతమతమవుతున్నాయి. సౌకర్యాలు లేక శిథిలమవుతున్నాయి. ఇప్పటికే వేల బడులు మూసివేశారు. విద్యాశాఖను ఒక ముఖ్యమైన భాగంగా తీసుకొని, తగిన నిధులు కేటాయించాలి.5) తెలంగాణా ఉద్యమకారుల గుర్తింపును పారదర్శకంగా చేయాలి. పైరవీలకు తావివ్వరాదు. అలానే ఉద్యమకారులను ఎ.బి.సి.డిలుగా వర్గీకరించి వారికి ప్రభుత్వ పథకాన్ని వర్తింప చేయాలి. తక్షణమే అమలు చేయాలి.6) ఖమ్మం జిల్లాలో మిగిలిన పోడు భూములన్నింటికి పట్టాలు ఇవ్వాలి.7) గోదావరి జలాలను పాలేరు వరకు మళ్ళించేలా చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో బందెల వెంకయ్య, కమ్మ కోమటి నాగేశ్వరరావు, టీ. ఝాన్సీ పి. శోభ, కే.శ్రీనివాస్, తిమ్మిడి హనుమంతరావు తదితరులు ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు బయోడేటా1.పేరు: సివైపుల్లయ్య. "హోదా : సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎన్ని కోచదువుండిగ్రీ(దీూ 19490700086స్వగ్రామం: కోర్లట్ల గూడెం, నేలకొండపల్లి మండలం, ఖమ్మం జిల్లాతల్లిదం డ్రులు: 'బచ్చల కూర చంద్రమ్మ, యలమందయ్య,నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంటంజీవిత సహచరి: టి ఝాన్సీ లక్ష్మి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి, జిల్లా నాయకురాలు, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కోశాధికారిగా పనిచేస్తున్నారు. కుమారుడు జేపీ స్టాలిన్, బి ఏ, ఎల్ ఎల్ బి2. 1983లో జడ్పీఎస్ఎస్ రాజేశ్వరపురంలో, 1985లో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ఏనుకూరు హై స్కూల్ విద్యాభ్యాసం చే స్తుండగా ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు పరిచయమైనది.3. 1989-91లో నెలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ పూర్తి కాలం కార్యకర్తగా రావడం జరిగింది. 1994-96 వరకు ఎస్ఆర్ అండ్ బిజిఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ చదవటం జరిగింది.4. పి డి ఎస్ యు తిరుమలాయపాలెం తాలూకా కమిటీ మెంటర్గా, నెలకొండపల్లి ఏరియా కమిటీ కార్యదర్శి గా, మొట్టమొదటి పాలేరు డివిజన్ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శిగా, 1994లో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నిక కావటం జరిగింది.5. 2004లో ప్రగతిశీల యువజన సంఘం సి వై ఎల్ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, 2012లో 2015, 2018లో రాష్ట్ర కార్యదర్శిగా మూడు దఫాలుగా కొనసాగటం జరిగింది.6. 2011లో సీపీఐ ఎంఎల్ ఉమ్మడి న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడిగా, కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నిక కావడం జరిగింది. 2018లో పాలేరు డివిజన్ కార్యదర్శిగా పనిచేయడం జరిగింది.7. 1992లో ఆనాటి పార్టీ లైన్ ప్రకారం 2 సంవత్సరాలు ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం జరిగింది.8. 2022 సంవత్సరంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నిక కావడం జరిగింది. ఉద్యమ కాలంలో నాలుగు సార్లు జైలు జీవితం గడపడం జరిగింది. అనేక దాడులు, కేసులు, నిర్బంధాలు ఎదుర్కోవటం జరిగింది.9. 1990లో సారా వ్యతిరేక ఉద్యమం, 1996 మార్చి 10న మిర్చి రైతాంగానికి మద్దతు ధరల సాధన ఉద్యమం, దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధనకై మహా పాదయాత్రలో, మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం 2000 సంవత్సరంలో బషీర్బాగ్ విద్యుత్ ఉద్యమంలో, ఖమ్మంలో పీజీ, లా కళాశాల పాదన ఉద్యమం, గుట్కా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నాను,10. జిల్లాలో పోడు భూముల సాధన ఉద్యమంలో కీలకంగా పాల్గొనడం జరిగింది జిల్లా, రాష్ట్ర స్థాయి అనేక విద్యార్థి, యువజన ఉద్యమాలలో క్రియాశీలక పాత్ర పోషించడం జరిగింది.11. హైదరాబాద్ లో, హిమాయత్ నగర్ లో జార్జి రెడ్డి స్మారక స్తూపం నిర్మాణంలో క్రియాశీలకంగా పాల్గొనడం జరిగింది.12. 1995లో హైదరాబాదులో జరిగిన పిడిఎస్యు రజతోత్సవాల సందర్భంగా ఖమ్మం నుండి హైదరాబాదుకు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పాల్గొనడం. జరిగింది.13. ఐటీడీఏ పాఠశాలల ప్రైవేటీకరణ పేరుతో స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే జీవోకు వ్యతిరేకంగా జిల్లాలో, రాష్ట్రస్థాయిలో వేలాది మంది తోఉద్యమం చేసి, విజయం సాధించడం జరిగింది.14. మహిళలను ఆత్మహత్యలకు పురి కొలుపుతున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలను నిషేధించాలని నిరంతర ఉద్యమం చేసి విజయం సాధించడం జరిగింది.??శ్రీ కళాశాలల విద్యార్థుల సమస్యలు లెక్చరర్స్ పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలని, నూతన బిల్డింగులు నిర్మాణం. చేయాలని చలో ఇంటర్మీడియట్ బోర్డు, కాకతీయ యూనివర్సిటీ కార్యక్రమం వేలాది మంది విద్యార్థులతో నిర్వహించి విజయాలు సాధించడం జరిగింది.16. 2017లో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ కు నిధులు కేటాయించాలని హైదరాబాదులో ఇందిరా పార్కులో 78 గంటల నిరాహార దీక్షలు చేసి విజయం సాదించడం జరిగింది.17. సహచరులు కామ్రేడ్ చెరాలు, కామ్రేడ్ కోలా శంకర్ లు అమరులు కావటం బాధను కలిగించింది.18. ఇష్టమైన నాయకులు కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్, రాయల సుభాష్ చంద్రబోస్, డాక్టర్ కె బాలగోపాల్, తదితర అనేకమంది అమరవీరులు .19. విద్యార్థి యువజన మాసపత్రిక తిరుగుబాటు పత్రిక ఎడిటర్ గా కొనసాగడం జరుగుతుంది.

# పీసీఐ-క్యూసీఐ జాతీయ ర్యాంకింగ్ లలో గీతం ఫార్మసీకి ప్రతిష్ఠాత్మక 'ఎ' గ్రేడు

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జులై 28 :**

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ), క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) సహకారంతో నాబెట్ (నాబేట్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ర్యాంకింగ్, ఫార్మసీ కళాశాలల రేటింగ్ (తొలి ఎడిషన్)లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని హైదరాబాదు, విశాఖపట్నంలోని రెండు ఫార్మసీ స్కూళ్లు అత్యున్నత రేటింగ్ అయిన ప్రతిష్ఠాత్మక 'ఎ' గ్రేడును సాధించడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాయని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.ఎస్. కుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ జాతీయ మూల్యాంకనంలో భారతదేశ వ్యాప్తంగా బి.ఫార్మసీ కోర్సులను అందిస్తున్న 398 సంస్థలను అంచనా వేసినట్టు తెలియజేశారు. వీటిలో, కేవలం 64 సంస్థలు (16.1 శాతం) మాత్రమే ప్రతిష్ఠాత్మకమైన 'ఎ' గ్రేడును సాధించాయని, ఇది ఈ మూల్యాంకనం యొక్క తీవ్రమైన పోటీతత్వాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ ర్యాంకింగ్ లో గీతం విశాఖపట్నం 43వ ర్యాంకును సాధించి, దేశంలోని అగ్రశ్రేణి 10.8 శాతం ఫార్మసీ సంస్థలలో ఒకటిగా నిలిచిందని తెలిపారు. అదే సమయంలో, గీతం హైదరాబాదు 54వ ర్యాంకును సాధించి, జాతీయ స్థాయిలో అగ్రశ్రేణి 13.6 శాతం సంస్థలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ విజయం ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన, మౌలిక సదుపాయాలు, పరిపాలన, విద్యార్థుల ఫలితాలలో శ్రేష్ఠత పట్ల గీతం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటిస్తోందని పేర్కొన్నారు. ఈ గుర్తింపు, నాణ్యత, ఆవిష్కరణ, విద్యా నైపుణ్యంపై విశ్వవిద్యాలయం యొక్క అచంచలమైన దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. అంతే కాకుండా, ఇది విశ్వవిద్యాలయం యొక్క దూరదృష్టి గల నాయకత్వానికి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పరిశోధక విద్యార్థుల అంకితభావానికి, రెండు ఫార్మసీ స్కూల్స్ చేపట్టిన నిరంతర సంస్థాగత నాణ్యతా కార్యక్రమాలకు నిదర్శనంగా నిలుస్తుందని వివరించారు. ఈ అద్భుతమైన జాతీయ విజయం సాధించినందుకు, గీతం నాయకత్వం రెండు ప్రాంగణాలలోని ఫార్మసీ స్కూళ్ల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, సహాయక సిబ్బందిని అభినందించినట్టు తెలియజేశారు. అలాగే, శ్రేష్ఠత పట్ల వారి నిరంతర నిబద్ధతను ప్రశంసించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కొడకండ్ల మండల బీఎల్‌ఏలకు దిశానిర్దేశం

## -ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం

**మీడియా టుడే జూలై 29:**

పాలకుర్తి నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొడకండ్ల మండల బూత్ లెవల్ ఏజెంట్ల బిఎల్ఏ తో పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం, క్షేత్రస్థాయి సమన్వయంపై బీఎల్‌ఏలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో కొత్తగా అర్హత పొందిన వారి పేర్ల నమోదు, తప్పుల సవరణ, మార్పులు, చేర్పులను సకాలంలో పూర్తి చేసి, ప్రతి అర్హుడి ఓటు నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బీఎల్‌ఏలు పార్టీకి వెన్నెముకలుగా పనిచేస్తూ ప్రతి బూత్‌లో సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్, వివిధ గ్రామాల బీఎల్‌ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న పటాన్ చెరులో బోనాల పండుగ

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జులై 29 :**

ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలను పటాన్ చెరు పట్టణంలో ఆగస్టు 10వ తేదీ సోమవారం నిర్వహించేందుకు పట్టణ పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించినట్లు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బోనాల పండుగ ఏర్పాట్లపై బుధవారం ఉదయం పటాన్ చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో స్థానిక మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అధ్యక్షతన పట్టణ పుర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీన నిర్వహించనున్న బోనాల పండుగ సందర్భంగా అన్ని దేవాలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో.. ఆనందోత్సాహాల మధ్య పండుగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ పుర ప్రముఖులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, పురోహితులు, ప్రజలు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుంది

## సర్పంచి మందుల నాగయ్య




**కోదాడ, జులై 29 (మీడియా టుడే)-:**
విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుందని సర్పంచి మందుల నాగయ్య అన్నారు. మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ), పాత గుడిబండ పాఠశాలలో బాలసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచి మందుల నాగయ్య పాల్గొని మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మించబడుతుందని అన్నారు. విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి అని అన్నారు.బాలల హక్కులు, విద్య యొక్క ప్రాముఖ్యత, పరిశుభ్రత, క్రమశిక్షణ, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తూ బాలసభ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ (హెచ్‌డబ్ల్యూ), పాత గుడిబండ పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకళ, గ్రామ కార్యదర్శి అవినాష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జయసింహా రెడ్డి గారు, వార్డ్ సభ్యులు ఖాజా, సక్రు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అంజిరెడ్డి చొరవతో శ్రీ రాజరాజేశ్వరి ఎంక్లేవ్ 2లో తీరిన త్రాగునీటి ఇబ్బంది



**రామచంద్రాపురం ప్రతినిధి మీడియా టుడే, జూలై 29 :**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ పరిధి పటేల్ గూడ శ్రీ రాజా రాజేశ్వరి ఎన్‌క్లేవ్ ఫేజ్-×× కాలనీ వాసుల చిరకాల వాంఛ నెరవేరింది. గత అనేక సంవత్సరాలుగా వేధిస్తున్న తాగునీటి కొరత ఎట్టకేలకు శాశ్వతంగా పరిష్కారం దొరికింది. కాలనీలో తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఇబ్బందిని అర్థం చేసుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి వెంటనే స్పందించారు. ?రామచంద్రాపురంలోని ఎమ్మెల్సీ నివాసంలో సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై, కాలనీలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, కాలనీలో నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 28 లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్సీ ప్రత్యేక చొరవ, పట్టుదల కారణంగా తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం లభించడం పట్ల కాలనీ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ మేరకు కాలనివాసులు తమ ప్రాంత సమస్యను స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్సీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బీరంగూడ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగం పెంచాలి

**జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన**

**అమీన్ పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి**




**అమీన్ పూర్ ప్రతినిధి, మీడియా టుడే, జులై 29 :**
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీరంగూడ డివిజన్-270-271 లో పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అమీన్ పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వందనపురి కాలనీ, ఎస్ ఎన్ ఐ కాలనీ, మారుతి నగర్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులను త్వరగా సాంక్షన్ చేసి వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని శశిధర్ రెడ్డి తెలిపారు. ఈ సంద్భంగా కాలనీ సొసైటీ నెంబర్ పలుగొనారు ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పదోన్నతి ఒక గౌరవం ప్రజాసేవలో మరింత బాధ్యతగా సేవ చేయాలి

## జిల్లా ఎస్పీ -సునిత రెడ్డి, ఐపీఎస్




**వనపర్తి జిల్లా మీడియా టుడే ప్రతినిధి**
**రమేష్ రెడ్డి జూలై 29**
హెడ్ కానిస్టేబుల్ హోదా చిహ్నాలు అలంకరించి అభినందనలు తెలిపిన ఎస్పీ పోలీసు శాఖ ప్రతిష్ఠను నిలబెట్టే ఆదర్శ అధికారులుగా ఎదగాలని సూచన క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని సూచనపోలీసు శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడమే కాదు. ప్రజల భద్రత, న్యాయం, సేవ పట్ల మరింత అంకితభావంతో ముందుకు సాగే బాధ్యతను స్వీకరించినట్లేనని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వనపర్తి పట్టణ పోలీస్టేషన్ కు చెందిన కానిస్టేబుళ్లు రాజ గౌడ్, నాగేశ్వరరావు, పానుగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన లక్ష్మీ నర్సమ్మ, రాంగోపాల్ వర్మ, పెబ్బేరు పోలీస్ స్టేషన్‌కు చెందిన నాగరాజు, బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ వారికి హెడ్ కానిస్టేబుల్ హోదా చిహ్నామైన బ్యాడ్జీలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని పేర్కొన్న ఎస్పీ, ప్రజలకు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా మార్పు మాత్రమే కాదు సమాజం, శాఖ మరియు ప్రజలు మనపై ఉంచిన విశ్వాసానికి లభించిన గౌరవప్రదమైన గుర్తింపు. ప్రతి పదోన్నతి కొత్త బాధ్యతలను, మరింత జవాబుదారీతనాన్ని, ఉన్నతమైన సేవా ప్రమాణాలను గుర్తు చేస్తుంది. హోదా పెరిగిన కొద్దీ ప్రజల పట్ల మన బాధ్యత, విధి పట్ల నిబద్ధత, చట్ట పరిరక్షణలో మన పాత్ర కూడా మరింత విస్తృతమవుతుంది. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కులను పరిరక్షించడం పోలీసు శాఖ యొక్క అత్యున్నత కర్తవ్యం. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేస్తూ, ప్రజలతో మర్యాదగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలి. ప్రజల విశ్వాసం, వారి ఆశీర్వాదం, వారు ఇచ్చే గౌరవమే పోలీసు ఉద్యోగానికి నిజమైన పురస్కారం. పదోన్నతి పొందిన సిబ్బంది శాఖ ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత అంకితభావంతో పనిచేయాలి. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన, సేవా తత్వం, నైతిక విలువలను తమ విధి నిర్వహణలో ప్రతిబింబిస్తూ, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు

# విక్రమ్ శీల బుద్ధ విహార్‌లో బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన

**- బంతే దీప్ రత్న ఆధ్వర్యంలో బౌద్ధ సంప్రదాయాలతో బుద్ధ వందనలు**

**- ప్రతిరోజూ బుద్ధ వందనలు నిర్వహించాలని పిలుపు**



**ముధోల్ జులై 29 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
రాంటెక్ గ్రామంలోని విక్రమ్ శీల బుద్ధ విహార్ లో గురు పౌర్ణిమ సందర్భంగా బుద్ధ విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ దమ్మ గురువు బంతే దీప్ రత్న తన చేతుల మీదుగా బుద్ధుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బౌద్ధ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై బౌద్ధ సంప్రదాయాల ప్రకారం త్రి శరణం, పంచశీల స్వీకరణతో పాటు బుద్ధ వందనలు నిర్వహించారు. బుద్ధుని బోధనలు, శాంతి, కరుణ, సమానత్వ సందేశాలను స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో వందనాలు చేశారు.అనంతరం బంతే దీప్ రత్న మాట్లాడుతూ గురుపౌర్ణిమ రోజున బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన జరగడం ఎంతో శుభప్రదమని పేర్కొన్నారు. బుద్ధుడు చూపిన ధమ్మ మార్గం మానవాళికి శాంతి, సౌభ్రాతృత్వం, సత్యం మరియు అహింసను బోధిస్తుందని అన్నారు. ప్రతి బౌద్ధ కుటుంబం బుద్ధుని బోధనలను తమ జీవితంలో ఆచరించాలని సూచించారు.ప్రతి రోజు విక్రమ్ శీల బుద్ధ విహార్ లో బుద్ధ వందనలు నిర్వహిస్తూ ధమ్మాన్ని ఆచరించాలని గ్రామ బౌద్ధ ప్రజలకు వారు పిలుపునిచ్చారు. బుద్ధుని జీవిత చరిత్ర, బోధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ముఖ్యంగా యువత బుద్ధుని జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని కోరారు.అలాగే విక్రమ్ శీల బుద్ధ విహార్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విహార్‌లో బుద్ధుని జీవిత చరిత్ర, ధమ్మ బోధనలు తెలిపే పుస్తకాలను ఏర్పాటు చేసి ప్రజలు చదివేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుద్ధుని బోధనలు సమాజంలో శాంతి, సమానత్వం, మానవతా విలువలను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని బౌద్ధ ప్రజలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గురుపౌర్ణిమ సందర్భంగా నిర్వహించిన ఈ బుద్ధ విగ్రహ ప్రతిష్టాపనగ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పగా, బౌద్ధ ధర్మంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే కార్యక్రమంగా నిలిచింది...

# ఉపాధి హామీ సోషల్ ఆడిట్‌పై ఆరోపణలుపారదర్శకతపై అనుమానాలు

**ముడుపులు చేతులు మారాయా - రాజకీయ నాయకుల ఒత్తిడ**

**సమగ్ర విచారణ జరపాలని ప్రజల డిమాండ్**




**మీడియా టుడేగరిడేపల్లి, జూలై 28:**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+బీ=జీ+రా) సోషల్ ఆడిట్ నిర్వహణపై గరిడేపల్లి మండలంలో పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా జరగాల్సిన సోషల్ ఆడిట్ ప్రక్రియను నామమాత్రంగా నిర్వహించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.స్థానికుల ఆరోపణల ప్రకారం, ఓపెన్ ఫోరం నిర్వహణకు ముందుగానే సంబంధిత డీఆర్పీ, ఎస్ఆర్పీలను ప్రభావితం చేసి, అనుకూల వాతావరణం ఏర్పరచుకున్న అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించారని ఆరోపిస్తున్నారు. దీంతో సోషల్ ఆడిట్ లక్ష్యాలైన ప్రజల అభిప్రాయాల సేకరణ, ఉపాధి హామీ పనుల్లో జరిగిన లోపాలు, అవకతవకలపై చర్చలు పూర్తిస్థాయిలో జరగలేదని వారు పేర్కొంటున్నారు.అంతేకాకుండా, కొన్ని గ్రామ పంచాయతీలలో సోషల్ ఆడిట్‌లో భాగంగా నిర్వహించాల్సిన డోర్ టు డోర్ విజిట్‌లు కూడా సక్రమంగా చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, కూలీల నుంచి సమాచారం సేకరణ జరగకుండానే ప్రక్రియను ముగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల సమక్షంలో విస్తృతంగా నిర్వహించాల్సిన ఓపెన్ ఫోరంను మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన లోపాలు, నిధుల వినియోగం, కూలీల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చ జరగకుండా కార్యక్రమాన్ని ముగించారనే ఆరోపణలు చేస్తున్నారు.మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో సోషల్ ఆడిట్ సందర్భంగా పెనాల్టీ, రికవరీ రూపంలో మొత్తం రూ.2,28,778లు విధించినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా పొనుగోడు గ్రామ పంచాయతీకి రూ.30,698లు పెనాల్టీ, రికవరీ కింద నమోదైనట్లు తెలుస్తోంది.ప్రజాధన వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే సోషల్ ఆడిట్ ప్రధాన ఉద్దేశమని, అలాంటి కీలక ప్రక్రియపై ఆరోపణలు రావడం ఆందోళనకరమని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర సోషల్ ఆడిట్ యూనిట్, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.బడ్జెట్ లేక ఓపెన్ ఫోరం మండల కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనట్లు అధికారులు తెలిపారు

# మిర్యాలగూడ లో మొట్ట మొదటి సారిగా ఓపెన్ హార్ట్

# బైపాస్ సర్జరీనీ విజయవంతంగా నిర్వహించిన జ్యోతి హాస్పిటల్







**మిర్యాలగూడ జులై 29 (మీడియా టుడే):**
మిర్యాలగూడ పట్టణంలో జ్యోతి హాస్పిటల్ వైద్యులు మొట్ట మొదటి సారిగా ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ విజయవంతం చేశారు. హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఆధునాతన వైద్య సదుపాయాలు కల్పిస్తూ, ఏ రకమైన శస్త్ర చికిత్సలను అయినా 24/7 రోజులు మిర్యాలగూడ పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా గత 30 ఏళ్లుగా మిర్యాలగూడ లో రాణిస్తున్నది జ్యోతి హాస్పిటల్ అన్నారు. కార్డియాలజీ విభాగం గత రెండు సంవత్సరాలుగా అత్యున్నత అధునాతన సేవలు అందిస్తుంది. కార్డియో థొరోసిక్ సర్జరీ సీటీవీఎస్ మొట్ట మొదటి సారిగా మొదలు పెట్టాము. వీర్లపాలెం కు చెందిన 60 ఏళ్ల మహిళ ఛాతీ నొప్పి తో బాధపడుతూ హాస్పిటల్లో అడ్మిన్ అయ్యారు. హాస్పిటల్ వైద్య బృందం యాంజియోగ్రామ్ చేసి రక్త నాళాలలో అనేక పూడికలు ఉన్నాయని తేలడంతో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని తనకి తన వాళ్ళకి చెప్పి ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతగా చేయడం జరిగింది. ఆపరేషన్ జరిగిన 5 వ రోజున ఇంటికి డిశ్చార్జ్ చేశాము అన్నారు. ఈ ఆపరేషన్ ను పేషెంట్ వాళ్ళకి ఏ ఖర్చు లేకుండా ఆరోగ్య శ్రీ ద్వారా అందించామని పేర్కొన్నారు. ఓపెన్ హార్ట్ బైపాస్ సర్జరీ అనగానే హైదరాబాద్ లేదా వేరే ఏదైనా పట్టణం పోవలసిన పరిస్థితి వచ్చేది. ఇప్పుడు ఎటు వెళ్ల వలసిన అవసరం లేదు అన్నారు. వేరే శస్త్ర చికిత్సలతో పోలిస్తే బైపాస్ చాలా క్లిష్టమైనది ఎందుకంటే హార్ట్ లంగ్ మెషిన్, హీటర్ కూలర్, మైక్రో ఇన్స్ట్రుమెంట్స్ ఆపరేషన్ లో పాల్గొనే సర్జన్స్ టీమ్, ఎన్నో ప్రత్యేకమైన పరికరాలు, అత్యున్నత నైపుణ్యం కలిగిన డాక్టర్స్, సపోర్ట్ స్టాఫ్ అవసరం. అటువంటి క్లిష్టమైన ఆపరేషన్ ను ఒక మిర్యాలగూడ వంటి చిన్న టౌన్ లో చేయడం అనేది గొప్ప విషయం. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 పైగా డాక్టర్లు, హాస్పిటల్ సపోర్ట్ స్టాఫ్ ఈ ఆపరేషన్ విజయవంతగా చేయడం లో సహాయ పడ్డారు. వైద్య విభాగంలో ఎప్పటికప్పుడు అదునాతన శస్త్ర చికిత్సలను జ్యోతి హాస్పిటల్ ద్వారా అందించగలుగుతున్నాం అన్నారు. ఈ ఆపరేషన్ లో డా.రమేష్ సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్, డా.మనోజ్ కుమార్ రెడ్డి కార్డియాలజిస్ట్, డా.లావణ్య కడిమి, డా.కృష్ణ చక్ర కార్డియాక్ అనస్థీషియా, కార్డియాక్ క్రిటికల్ కేర్ టీమ్, డా.ముప్వ రామారావు మేనేజింగ్ డైరెక్టర్, సర్జన్, డా.జీవన జ్యోతి కో-ఫౌండర్, జ్యోతి హాస్పిటల్, డా.ముప్వ శ్రీహర్ష గ్యాస్ట్రో సర్జన్, కార్డియాక్ స్టాఫ్ విజయ లక్ష్మి, సునీల్, సైదులు, లక్ష్మణ్, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ దేగ వీటి, ఆరోగ్య మిత్ర షేక్.బషీరుద్దీన్, కార్డియాలజీ సపోర్ట్ స్టాఫ్ బాలు, నాగరాజు, నాగేందర్ పాల్గొన్నారు.

## కోలూర్ రైతు వేదికలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు



**తానూర్, జులై 29():** మండలంలోని కోలూర్ రైతు వేదికలో బుధవారం సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు,పంటల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ పద్ధతులను ఎక్కువగా పాటించాలని క్లస్టర్ వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు, రసాయనాల వల్ల భూసారం దెబ్బతింటుందని చెప్పారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం.ఎల్)మాస్ లైన్ జిల్లాకార్యదర్శిగాసి.వై.పుల్లయ్య

**నేలకొండపల్లిజూలై29మీడియా టుడే ప్రతినిధి**



సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శిగా కామ్రేడ్ సి.వై. పుల్లయ్యను ఏకగ్రీవంగా ఖమ్మం జిల్లా కమిటీసమావేశం ఎన్నుకున్నది. పుల్లయ్యవిద్యార్థి, యువజన, ప్రజా ఉద్యమాలలో 3 దశాబ్దాల కాలంగా పనిచేస్తున్నారు. పుల్లయ్యను రాష్ట్ర బాధ్యుల సమక్షంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నది.సివైపుల్లయ్య. సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎన్నికయ్యారు. ఆయనడిగ్రీచదువుకున్నారు .ఆయననేలకొండపల్లి మండల పరిధిలోనికోరట్లగూడెం, గ్రామానికి చెందినబచ్చల కూర చంద్రమ్మ,యలమందయ్య, కుమారుడు.నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆయనజీవిత సహచరిటి ఝాన్సీ లక్ష్మి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి,గా జిల్లా ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు)రాష్ట్రకోశాధికారిగా పనిచేస్తున్నారు.కుమారుడు జేపీ స్టాలిన్, బి ఏ, ఎల్ ఎల్ బి1983లో జడ్పీఎస్ఎస్ రాజేశ్వరపురంలో,1985లో ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ఏనుకూరు హై స్కూల్ విద్యాభ్యాసం చే స్తుండగా ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు పరిచయమైనది.1989-91లో నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశారు . 1994-96 వరకుఎస్ఆర్ అండ్ బిజిఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ చదివారు.పి. డి.ఎస్.యు.తిరుమలాయపాలెం తాలూకా కమిటీ మెంటర్గా, నెలకొండపల్లి ఏరియా కమిటీ కార్యదర్శి గా,మొట్టమొదటి పాలేరు డివిజన్ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శిగా, పనిచేశారు.1994లో ఖమ్మం జిల్లా కార్యదర్శిగా,రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.2004లో ప్రగతిశీల యువజన సంఘం సి వై ఎల్.జిల్లా కార్యదర్శిగా, 2012లో 2015, 2018లో రాష్ట్ర కార్యదర్శిగా మూడు దఫాలుగాపుల్లయ్యప నిచేశారు2011లో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడిగా, కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2018లో పాలేరు డివిజన్ కార్యదర్శిగాపనిచేశారు.1992లోఆనాటిపార్టీఇచ్చినపిలుపుమేరకు2సంవత్సరాల పాటు ఏజెన్సీ ప్రాంతంలో పుల్లయ్య పనిచేశారు.2022సంవత్సరంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆయన పార్టీ కోసం లాటి దెబ్బలు తినడం జైలు జీవితంగడపటం జరిగింది.


## డివిజన్ ప్రజల భద్రతే లక్ష్యం

**దేవేందర్ రెడ్డి**

**భారీ వర్షాలపై అధికారులకు అప్రమత్తత సూచన**

**లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలకు పిలుపు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి**



**ఉప్పల్, జూలై 29 (మీడియా టుడే ప్రతినిధి):** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో డివిజన్ ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను వెంటనే పరిశీలించి నీటి నిల్వలను తొలగించాలని కోరారు. మున్సిపల్, విద్యుత్, తాగునీటి సరఫరా, విపత్తు నిర్వహణ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అత్యవసరం అయితే తప్ప ప్రజలు బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని కోరారు. ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్లు స్పందన్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**నడిగూడెం, జూలై29 (మీడియా టుడే)-:**



గురు పౌర్ణమి పురస్కరించుకొని నడిగూడెం సాయిబాబా మందిరంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబావారికి పంచామృత పలరసాలతో అభిషేకం ప్రత్యేక పుష్పాలంకరణ గురువులకు సత్కారం మధ్యాహ్న హారతి అన్నదానం సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యారంగంలో విశిష్ట కృషిచేసిన గురువులైన బాజా ఉపేందర్ రావ్, వి ఎల్ ఎన్ చారి ,రఘు శ్రీదేవి, వెంకటేశ్వర్లను ఘనంగా సత్కరించారు. ఖమ్మం పట్టణానికి చెందిన ఆదినారాయణ చేసిన సత్సంగం భక్తులను ఆకట్టుకుంది .కార్యక్రమంలో సాయి సేవా సమితి నిర్వాహకులు రేపాల పురుషోత్తం, ఎం వి రమణ రావు, మహేష్ ,అప్పారావు బాలాజీ నాయక్, దయాకర్ దివ్య లా శ్రీనివాసరావు, భువనగిరి ఉపేందర్, సూర్య ప్రకాష్ రావు, మందిర పూజారి రాజశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవంలో చెట్లు నాటిన మున్సిపల్ చైర్మన్



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూలై 29 :** ఆర్మూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గుండ్ల చెరువు వద్ద బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. చైర్ పర్సన్ గోనె లహరి రఘు, కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిలర్లు మొక్కలు నాటారు. చైర్ పర్సన్ గోనె లహరి రఘు మాట్లాడుతూ మనం నాటే ప్రతి మొక్క రేపటి తరానికి ఆక్సిజన్ లాంటిది అన్నారు. ప్రకృతి మనకు అనుకూలంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలంటే వాతావరణం సమతుల్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. పర్యావరణం, మన చుట్టూ ఉన్న ప్రకృతి ఇదే మానవ మనుగడకు ఎంతో అవసరం అన్నారు. చెట్లను పూజించే సాంస్కృతి కూడా మన దేశంలో ఉందని గుర్తు చేశారు. నానాటికి కాలుష్యం పెరిగిపోతుంది. కావున, రాబోయే భవిష్యత్ తరాలు బాగుండాలన్న, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలన్న దానికి పరిష్కారం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పట్టణాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు తమ ఇంటి ఆవరణలో రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ చిన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూపేందర్, చిట్టి రెడ్డి, నర్మే నవీన్, సడక్ వినోద్, బొప్పేన ప్రసాద్, నాయకులు శాల ప్రసాద్, సుమన్, గంగూలీ, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, సానిటరీ సూపర్వైజర్ నరేందర్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, మున్సిపల్ డిఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మూడున్నరేళ్ల మౌనం వీడిన జగ్గారెడ్డి

**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో, జూలై 29.** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి మరోసారి తన వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. జూలైలో కీలక విషయాన్ని వెల్లడిస్తానని గతంలో ప్రకటించిన ఆయన, బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. గత మూడున్నరేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పార్టీ అంతర్గత వ్యవహారాలపై తాను ఉద్దేశపూర్వకంగానే మౌనం పాటించానని వెల్లడించారు.ఈ మౌనానికి కారణం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకు ఇచ్చిన మాటేనని జగ్గారెడ్డి తెలిపారు. ఎన్నికలకు ముందు ఢిల్లీలో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ తనను పక్కకు పిలిచి, పార్టీపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే మీడియా ముందు మాట్లాడకుండా నేరుగా ఢిల్లీకి వచ్చి తనతో చర్చించాలని సూచించారని చెప్పారు. ఆ మాటకు కట్టుబడి ఇప్పటివరకు పార్టీ రాజకీయాలు, ప్రభుత్వ వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడలేదన్నారు.పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తనకు అభిప్రాయాలు ఉన్నప్పటికీ, వాటిని మీడియా ముందు కాకుండా అధిష్ఠానానికి మాత్రమే చెప్పాలనే నిర్ణయంతోనే ఉన్నానని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ్రాజ సమావేశాలకు కూడా ఇదే కారణంతో హాజరు కాలేదన్నారు. సమావేశంలో మాట్లాడితే ఆ విషయాలు బయటకు లీక్ అవుతాయని భావించి దూరంగా ఉన్నానని పేర్కొన్నారు.తన రాజకీయ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్న జగ్గారెడ్డి, సంగారెడ్డి రాంనగర్‌లోని రామ్ మందిర్ నుంచి విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన తన ప్రయాణం, ఢిల్లీలో రాహుల్ గాంధీ ఎదుట కూర్చునే స్థాయికి చేరిందని చెప్పారు. అధికారంలో ఉన్న నాయకులను పదవిలో ఉన్నంత వరకే గుర్తుంచుకుంటారని, కానీ గాంధీ కుటుంబాన్ని దేశ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని రాహుల్ గాంధీతో చెప్పినట్లు వెల్లడించారు.అత్యంత ఆసక్తికరంగా, తన మనసులో ఒక ప్రత్యేక రాజకీయ ప్రణాళిక ఉందని, దానికి సంబంధించిన పూర్తి వివరాలను నవంబర్‌లో వెల్లడిస్తానని ప్రకటించారు. మరో మూడు నెలల్లో రాజకీయంగా తనకు స్పష్టత వస్తుందని, ఆ తర్వాత తన నిర్ణయాన్ని ప్రజల ముందుంచ ుతానని చెప్పారు. తనకు కుటుంబం కంటే ప్రజలు, రాజకీయాలే ముఖ్యమని, రోజంతా ప్రజా సమస్యలు, రాజకీయాల గురించే ఆలోచిస్తానని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.జగ్గారెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. నవంబర్‌లో ఆయన ప్రకటించబోయే "పొలిటికల్ డిజైన్" ఏమిటన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# గురుపౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

**షిరిడి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

**నారాయణఖేడ్, జూలై 29:** నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, అనుపమ దంపతులు పాల్గొని శ్రీ షిరిడి సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, గురువు ప్రాశస్త్యాన్ని చాటిచెప్పుతూ సన్మార్గంలో నడిపించే గురుపౌర్ణమి పర్వదినం ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. షిరిడి సాయిబాబా బోధించిన "శ్రద్ధా--సబూరి" సూత్రాలు, "మానవసేవే మాధవసేవ" అనే సందేశం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకాలని తెలిపారు.నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని, షిరిడి సాయిబాబా దివ్య ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీ కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వాస్పరి ప్రశాంతి, జహీరాబాద్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వినోద్ పాటిల్, కాంగ్రెస్ నాయకులు రమేష్ చౌహాన్, శ్రీకాంత్ రెడ్డి, నర్సింలు, మాణిక్ ప్రభు సేట్, ఆలయ ధర్మకర్తలు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, సాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చెరువును తలపిస్తున్న నారాయణఖేడ్ బైపాస్ రోడ్డు

**వర్షపు నీటిలో నిలబడి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి నిరసన**

**రోడ్ల దుస్థితి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై ప్రభుత్వంపై విమర్శలు**



**నారాయణఖేడ్, జూలై 29:** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్డు పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తోందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే నిలబడి నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్ అభివృద్ధే లక్ష్యంగా బైపాస్ రోడ్డుతో పాటు అనేక ప్రధాన రహదారులకు నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధిని పక్కనపెట్టి ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కమిషన్లకే ప్రాధాన్యత ఇస్తూ కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకురావడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, దీంతో ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ రహదారి సమీపంలో పాఠశాలలు, ఆసుపత్రులు ఉండటంతో విద్యార్థులు, రోగులు, వృద్ధులు, గర్భిణీలు నిత్యం ప్రాణభయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.పట్టణంలోని అనేక ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారాయని పేర్కొన్నారు. వర్షం పడినప్పుడల్లా రోడ్లపై నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రోజువారీ చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో వర్షపు నీటితో కలిసి దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని మండిపడ్డారు.పట్టణ ప్రజలకు సకాలంలో తాగునీరు కూడా అందడం లేదని, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భూపాల్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు పట్టణ అవసరాలకు అనుగుణంగా నీటి ట్యాంకులను నిర్మించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రహదారులను అత్యవసరంగా పునర్నిర్మించడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, తాగునీటి సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని కోరారు. ప్రజల సమస్యలను ఇకపై కూడా నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా పోరాడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విఠల్‌రావు పటేల్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సేట్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు లయక్, రాజు నాయక్, రవీందర్ రెడ్డి, మల్గొండ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐ ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన కాంగ్రెస్ లీడర్లు

**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,జూలై 29: రామన్నపేట,ప్రతినిధి**

రామన్నపేట నూతనంగా వచ్చిన సిఐ ఎం రవి, ఎస్సై సతీష్ గోపతిలకు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన మాజీ మదర్ డైరీ చైర్మన్ గంగుల కృష్ణారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరోద్దీన్,సీనియర్ అడ్వకేట్ ముత్యాల సత్తిరెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాఘవుల అనంత కుమార్,కేశవదాస్ వెంకటేష్,ముక్కామల పాపయ్య,కచ్చి నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# కుల్కచర్లను నూతన నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

- ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో వికారాబాద్‌లో భారీ నిరసన

-- త్వరలోనే ఉధృత ఉద్యమ కార్యాచరణ ప్రకటన



**కుల్కచర్ల (మీడియా టుడే) జూలై 29:**
భివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కుల్కచర్ల మండలాన్ని వెంటనే నూతన శాసనసభ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారంనాడు మండల కేంద్రములోని ప్రధాన చౌరస్తా దగ్గర వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వాలు స్పందించి కొత్త నియోజకవర్గాల ఏర్పాటులో భాగంగా కుల్కచర్లకు ప్రత్యేక స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కుల్కచర్ల మండలంలో నియోజకవర్గానికి కావలసిన అన్ని రకాల భౌగోళిక, ఆర్థిక వనరులు సంపూర్ణంగా ఉన్నాయని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల పునర్విభజన ప్రక్రియలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కుల్కచర్లను ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే గ్రామ గ్రామాన ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఉధృతమైన ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో జాట్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఘనపూర్ రాఘవేందర్ గౌడ్, కుల్కచర్ల సర్పంచ్ వార్వాల అంజలయ్య, మాజీ సర్పంచ్ జానకిరామ్, మండల బీజేపీ నాయకులు గాదె మైపాల్, మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వినోద్, గడసు మైపాల్, హనుమంతు, మల్లేష్, రాములు, మోనాచారి, బుచ్చయ్య, భీమయ్య, రామచంద్రయ్య, చీపిరి రాములు, కొండ ఆంజనేయులు, తిరుమలాపూర్ నర్సింలు తదితరులతో పాటు వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బోధి వృక్షం జ్ఞానానికి ప్రతీక బంతే దీప్ రత్న సాగర్ బోధి

- నాటిన బోధి వృక్షాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా సంరక్షించాలి.

- దాని పరిరక్షణను సమిష్టి బాధ్యతగా తీసుకోవాలని బంతే దీప్ రత్న సాగర్ బోధి పిలుపు.



**భైంసా జూలై 29 మీడియా టుడే**
గురు పౌర్ణిమ సందర్భంగా భైంసా పట్టణంలోని బుద్ధ విహార్ ప్రాంగణంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక వాతావరణంలో బోధి వృక్షం (మర్రి చెట్టు) నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంతే దీప్ రత్న సాగర్ బోధి చేతుల మీదుగా బోధి వృక్షాన్ని నాటారు. అనంతరం బౌద్ధ సంప్రదాయాల ప్రకారం బుద్ధ వందనాలు, త్రిశరణాలు, పంచశీల స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించారు. బుద్ధుని బోధనలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో వందనాలు చేశారు. కార్యక్రమానికి హాజరైన భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు బోధి వృక్షానికి నమస్కరించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా బంతే దీప్ రత్న సాగర్ బోధి మాట్లాడుతూ, బోధి వృక్షానికి బౌద్ధ ధర్మంలో అత్యంత విశిష్టమైన స్థానం ఉందన్నారు. గౌతమ బుద్ధుడు బుద్ధ గయలోని బోధి వృక్షం కింద లోతైన ధ్యానం చేసి సమ్యక్ సంబౌద్ధి(జ్ఞానోదయం) పొందారని తెలిపారు. అందువల్ల బోధి వృక్షం జ్ఞానం, కరుణ, శాంతి, మానవతకు ప్రతీకగా నిలిచిందన్నారు. అలాగే బుద్ధుని జీవితంలో సుజాత అనే మహిళ పాత్ర ఎంతో గొప్పదని వివరించారు. ధ్యానంలో నిమగ్నమైన సిద్ధార్థ గౌతమునికి సుజాత పాలపాయసం సమర్పించిందని, అనంతరం ఆయన బోధి వృక్షం కింద ధ్యానం చేసి బుద్ధుడిగా జ్ఞానోదయం పొందారని చెప్పారు. బౌద్ధ సాంప్రదాయాల్లో సుజాత కథకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదుగురు బంతెలకు దమ్మ దీక్ష (దమ్మ దీక్ష) అందజేసినట్లు తెలిపారు. ధర్మ ప్రచారం, బుద్ధుని బోధనల విస్తరణకు అంకితభావంతో సేవ చేయాలని వారికి సూచించారు. గురు పౌర్ణిమ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ సభ్యులు, బౌద్ధ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుద్ధుని బోధనలు సమాజంలో శాంతి, సమానత్వం, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, ప్రతి ఒక్కరూ ధర్మమార్గాన్ని అనుసరించాలని ఈ సందర్భంగా బౌద్ధులకు పిలుపునిచ్చారు

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడుగుడిబోయిన సైదులు మృతికి నివాళులర్పించిన వున్నం బ్రహ్మయ్య



**నేలకొండపల్లి జూలై 29 మీడియా టుడే ప్రతినిధి**
నేలకొండపల్లి గ్రామానికి చెందిన మాజీ గ్రామపంచాయతీవార్డు మెంబర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడిబోయిన సైదులు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న నేలకొండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య. సైదులు పార్థివ దేహాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో5వ వార్డు నెంబర్ సోడిపొంగు ఈశ్వరి, టౌన్ సెక్రటరీ వీణ వాజీద్, కొటారి ప్రసాద్, యూత్ నాయకులు సోడిపొంగు ప్రశాంత్, చింతమల్ల వెంకటేష్, చింతల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి దంపతులను సన్మానం

## ఆకుల కోటేశ్వర్ రమ్య దంపతులు-చందపల్లి దేవాలయ అర్చకులు



యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,

**జూలై 29: రామన్నపేట,ప్రతినిధి**
రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో చందపల్లి దేవాలయ అర్చకులు ఆకుల కోటేశ్వర్ రమ్య దంపతులు గురు పౌర్ణమి సందర్భంగా వారి గురువు అయిన బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి దంపతులను ఘనంగా సన్మానించినారు. అనంతరం బ్రహ్మశ్రీ బేతోజు సత్యనారాయణ శాస్త్రి మాట్లాడుతూ ఈ ప్రపంచంలో మనం ఏ స్థానంలో ఉన్న విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రతిరోజు మనం మనస్ఫూర్తిగా తల్లిదండ్రులతో సమానంగా వారిని పూజించాలని వారి యొక్క సేవలను ప్రతినిత్యం మనం గుర్తుకు చేసుకోవాలని తెలిపినారు. అనంతరం వారి ప్రియ శిష్యులు అయిన చందేపల్లి దేవాలయ అర్చకులు ఆకుల కోటేశ్వర్ రమ్య దంపతులను జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించినారు. అనంతరం బ్రహ్మశ్రీ బేతోజు. సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి చేతుల మీదుగా సర్వ కంకణం పండిట్ ఆకుల కోటేశ్వర్ కి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శశిధర్ పంతులు,సామాజిక కార్యకర్త నోముల యాదగిరి,గ్రామ పెద్దలు వల్లే వెంకటరెడ్డి, దంపతులు బత్తుల కోటీశ్వర్ రెడ్డి,బత్తుల సులోచన,కోయగూర లక్ష్మమ్మ,తొలి అక్షరం రిపోర్టర్ నోముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖచ్చితత్వంతో కూడిన వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు అందించాలి

## నూతన క్యాంపు కార్యాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్ జిల్లా: (మీడియా టుడే) జూలై 29, 2026**
జిల్లా వ్యాప్తంగా నమోదయ్యే వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో గల భూగర్భ జలాల కొలతల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాల నమోదు తీరును పరిశీలించారు. వివరాలన్నీ ఖచ్చితత్వంతో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్మల్ గ్రామీణ మండలం అక్కాపూర్ గ్రామంలోని విద్యుత్ ఉపకేంద్రం ప్రాంగణంలో ఉన్న వర్షపాత మాపక కేంద్రం (రైన్ గేజ్ వాటర్ మెజర్మెంట్ స్టేషన్) పరిశీలించారు. వర్షపాతం కొలత, నమోదు, తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖచ్చితత్వంతో కూడిన వర్షపాతం వివరాలు ఎప్పటికప్పుడు వేగంగా అందజేస్తూ ఉండాలన్నారు. వివరాలన్నీ పకడ్బందీగా నమోదు చేస్తూ ఉండాలని తెలిపారు. అనంతరం ఎల్లపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. క్యాంపు కార్యాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని చెప్పారు. పనులన్నీ నాణ్యవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపివో గంగారెడ్డి, తహసిల్దార్ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, హైడ్రో జియాలజిస్ట్ వంశీ కృష్ణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక దశలోనే విద్యార్థులకు గట్టి పునాది వేయాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం - ఎస్‌సీఆర్టీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ,

## శిక్షణా తరగతులను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి జూలై 29**
విద్యార్థుల భవిష్యత్‌కు ప్రాథమిక విద్యే బలమైన పునాదని, ఆ దశలో అందించే బోధన నాణ్యతే వారి ఉన్నత విద్యతో పాటు జీవిత విజయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, చదవడం, రాయడంలెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాల్లో సంపూర్ణ ప్రావీణ్యం కల్పించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని డిఇఓ తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపులో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు చూపే అంకితభావమే విద్యార్థుల అభ్యాస ఫలితాలను నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి హైదరాబాద్ ఎస్ సీ ఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఐ ఐ ఎస్ టి టి కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో నాణ్యమైన విద్యా ప్రమాణాల అమలు, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్), ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో అభ్యాస సామర్థ్యాల పెంపు, విద్యార్థి కేంద్రిత బోధనా విధానాలు, నిరంతర మూల్యాంకనం, సమర్థవంతమైన తరగతి గది నిర్వహణ వంటి అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ సందర్శించి పరిశీలించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో ముఖాముఖిగా మాట్లాడి శిక్షణలో బోధిస్తున్న అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదిలో అమలు చేయాల్సిన ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచే కార్యాచరణ, ప్రతి విద్యార్థిని అభ్యాసంలో భాగస్వామిని చేసే విధానాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ..., ప్రాథమిక విద్యార్థుల్లో చిన్న వయస్సులోనే మంచి అభ్యాస అలవాట్లు పెంపొందితే వారి భవిష్యత్ విద్యాభ్యాసం మరింత సులభంగా సాగుతుందని తెలిపారు. ముఖ్యంగా చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చోట వ్యక్తిగత శ్రద్ధతో బోధన అందించాలని సూచించారు. ఒక విద్యార్థి కూడా అభ్యాసంలో వెనుకబడకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ పఠన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారుల్లో పుస్తక పఠన అలవాటు పెంపొందితే భాషా నైపుణ్యాలు, పదసంపద, భావవ్యక్తీకరణ, అర్థగ్రహణ సామర్థ్యం పెరుగుతాయని, తద్వారా అన్ని సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు పఠన సామగ్రిని కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతి తరగతి గదిని విద్యార్థులు ఆనందంగా నేర్చుకునే అభ్యాస కేంద్రంగా తీర్చిదిద్దాలని డీఈఓ తెలిపారు. కేవలం ఉపన్యాస పద్ధతిలో కాకుండా కార్యకలాపాల ఆధారిత బోధన, కథలు, పాటలు, ఆటలు, చిత్రాలు, బొమ్మలు, బోధనా-అభ్యాస సామగ్రి టీ.ఎల్.ఎం. వినియోగం ద్వారా బోధనను ఆసక్తికరంగా మార్చాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా పాల్గొని నేర్చుకునే అవకాశాలు కల్పిస్తే అభ్యాస ఫలితాలు మరింత మెరుగుపడతాయని వివరించారు. ఎస్‌సీఆర్టీ రూపొందించిన శిక్షణా మాడ్యూళ్లను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులను రోజువారీ బోధనలో వినియోగిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. అభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారికి అదనపు బోధన, ప్రత్యేక తరగతులు, వ్యక్తిగత మార్గదర్శకత్వం అందించాలని డీఈఓ సూచించారు. ప్రతి విద్యార్థి కనీస అభ్యాస నైపుణ్యాలను తప్పనిసరిగా సాధించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యార్థుల అభ్యాసంలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య సాధనలో ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఈఓ చేప్పారు. ఈ శిక్షణ ద్వారా

# కుషాయిగూడ బస్ స్టాప్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన

## కమిషనర్ వీరేంద్ర సాగర్ ఆకస్మిక తనిఖీ- పూల దుకాణాల వల్లే ట్రాఫిక్ అంతరాయం గుర్తింపు

## వ్యాపారుల సహకారంతో సమస్య పరిష్కారానికి చర్యలు

**ఉప్పల్, జూలై 29 (మీడియా టుడే ప్రతినిధి):**
కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన కాప్రా సర్కిల్ కమిషనర్ పోతుల వీరేంద్ర సాగర్ బుధవారం బస్ స్టాప్‌ను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాప్రా డిప్యూటీ కమిషనర్ పోతుల వీరేంద్ర సాగర్, కుషాయిగూడ బస్ డిపో మేనేజర్ వేణుగోపాల్, ట్రాఫిక్ సీఐ మల్లేష్‌తో కలిసి ట్రాఫిక్ సమస్యకు గల కారణాలను పరిశీలించారు. రహదారిపై పూల దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. దీంతో పూల వ్యాపారులు మార్కెట్ గోడకు ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అధికారుల నిర్ణయాన్ని పూల వ్యాపారులు స్వాగతిస్తూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలతో కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గి, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు సజావుగా సాగుతాయని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పనగట్ల చక్రపాణి గౌడ్, కొడకండ్ల యాదయ్య, వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, వాసుదేవ్ ముదిరాజ్, సల్లా వెంకటేష్, పిట్ల రాజు ముదిరాజ్, దయానంద్, రాములు, అనిల్ యాదవ్, బాలకృష్ణ, కిరణ్, నాగరాజు, వెంకటేష్, జంపాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ, ఎమ్మెల్యే లేకుండానే సీసీ రోడ్ల శంకుస్థాపన ఎందుకు?: గంధం నాగేశ్వరరావు

**ఎస్ఐఆర్ విధుల్లో ఉన్న అధికారులు ప్రభుత్వ కార్యక్రమంలో ఎలా పాల్గొన్నారు**

**ప్రభుత్వం, ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్**

**ఉప్పల్, జూలై 29 (మీడియా టుడే ప్రతినిధి):**



పార్లమెంట్ సభ్యుడు పార్లమెంట్ సమావేశాల్లో, స్థానిక ఎమ్మెల్యే అధికారిక పర్యటనలో ఉండగా వెంకట్‌రెడ్డి నగర్, రామంతపూర్ డివిజన్‌లలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాన్ని హడావుడిగా నిర్వహించాల్సిన అవసరం ఏమిటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంధం నాగేశ్వరరావు ప్రశ్నించారు.ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతుండటంతో స్థానిక ఎంపీ ఢిల్లీలో పార్లమెంట్ విధుల్లో ఉన్నారని, స్థానిక ఎమ్మెల్యే అవుట్ ఆఫ్ స్టేషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు లేకుండానే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడానికి గల కారణాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అధికారులు ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) విధుల్లో నిమగ్నమై ఉన్నారని, అలాంటి సమయంలో ఎన్నికల విధులను పక్కనబెట్టి ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ఎలా పాల్గొన్నారో ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని కోరారు.కాలనీల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలను ఆశ్రయిస్తే, అధికారులు ఎస్ఐఆర్ విధుల్లో ఉన్నందున అందుబాటులో లేరని చెబుతున్నారని గుర్తు చేశారు. అదే అధికారులు మంత్రి పాల్గొనే కార్యక్రమానికి పెద్దఎత్తున హాజరుకావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు, కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించి ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని గంధం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

## వర్షాధార పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి ఏరువాక శాస్త్రవేత్త శ్రీలత




**యాదాద్రి భువనగిరి జిల్లా మీడియా టుడే,జూలై 29; రామన్నపేట,ప్రతినిధి**
ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట (వర్షాధార) పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆత్మ సౌజన్యంతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్త శ్రీలత తెలియజేశారు.బుధవారం మండల కేంద్రంలోనీ రైతు వేదికలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిగిరిరెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రస్తుతం వరి మరియు పత్తిలో తీసుకోవలసిన యాజమాన్యం పద్ధతుల గురించి రైతులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్, పి ఎస్ సి ఎస్ డైరెక్టర్లు దిండిగాల సత్తయ్య, అంజయ్య,రైతులు బర్ల స్వామి,నరేందర్, ఐలయ్య,శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, యాదమ్మ,సరిత నరసింహ వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.శ్రీనివాస్, పి.శ్రీనివాస్, వి.కీర్తన,ఈ.లావణ్య పాల్గొన్నారు.

## తానూర్ కేజీబీవీలో స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం




**తానూర్:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న స్కావెంజర్ పోస్టు భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి–బి కేటగిరీకి చెంది, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన 18 సంవత్సరాలు నిండిన మహిళలు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆగస్టు 1 నుండి 10వ తేదీ వరకు తమ దరఖాస్తులను తానూర్ ఎంఆర్‌సీ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

## 7న హైదరాబాద్ లో పెన్షనర్ల మహాధర్నా

**ఎస్జీపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య**

**డిఎస్ నకారా కు ఘన నివాళులు- -రెండు వేల కోట్లు ఎక్కడ?**

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



సమస్యల సుడిగుండంలో విలవిల లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ హైదరాబాద్ లో పెన్షనర్ల మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు.బుధవారం పెన్షనర్ల పితామహుడు డి. ఎస్ నకారా వర్ధంతి సభకు అధ్యక్షత వహించిన పరిశపుల్లయ్య మాట్లాడుతూ.. మూడేళ్లు గడిచినా, పి ఆర్ సి జాడ తెలవటంలేదని,ఆరువిడతల డిఏ బకాయిలు పెట్టారని, హెల్త్ కార్డులు, స్కీమ్ గురించి పెద్ద పెద్ద ప్రకటనలు వచ్చాయని కాని ఆచరణలో ఏమీ లేదని, పెన్షనర్ల కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, ప్రత్యేకోపాధ్యాయుల సర్వీసుకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపు తదితర సమస్యలతో పెన్షనర్లు మానసిక వేదనకు గురి అవుతున్నారని చెప్పారు.డిఎస్ నకారా వర్ధంతి సందర్భముగా ఖమ్మం జిల్లా నుండి పెన్షనర్లు ఉద్యమ సమరశంఖం పూరిస్తున్నామని, పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య డిమాండ్ చేసారు.మే నెల పెన్షన్లు / వేతనాల నుండి హెల్త్ స్కీమ్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం, రెండునెలలు గడిచినా కార్డులు ఇవ్వక, వైద్యం అందక స్కీమ్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉండి పెన్షనర్లు తల్లడిల్లుతున్నారని పరిశపుల్లయ్య తెలిపారు.ముందుగా పెన్షనర్ల పితామహుడు డి ఎస్ నకారా వర్ధంతి సందర్భముగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈసందర్భముగా పెన్షనర్ల డిమాండ్ పోస్టర్లను రాష్ట్ర కార్యదర్శి వి మేరిఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి రాయలరవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా శాఖ సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బోజెడ్ల కృష్ణకుమారి, తాడి అంజలి, సీనియర్ పెన్షనర్లు చీదిరాల వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు,ఎస్కె అబ్దుల్ షరీఫ్,కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణ మూర్తి, గండ్లూరి కృష్ణారావు,పివిఆర్కెవి ప్రసాదరావు,కంచుమర్తి పుల్లయ్య, యండిహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలి

**- జలసిరి ఫామ్ పాండ్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి**

**- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్ కలెక్టరేట్ :(మీడియా టుడే) జూలై 29, 2026**
బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వన మహోత్సవం, జలసిరి ఫామ్ పాండ్ ల నిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారిగా నిర్దేశించిన లక్ష్యాలు, శాఖల వారిగా నాటే మొక్కలు, ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలసిరి ఫామ్ పాండ్ ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల వారిగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఫామ్ పాండ్ ల నిర్మాణ వివరాలు సమీక్షించారు. మొత్తం బోర్వేల్ రీచార్జ్ నిర్మాణాల ప్రగతి తెలుసుకున్నారు. గడువులోగా ఈ నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్ లు దోహదం చేస్తాయని వివరించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. నిజమైన అర్హుల పేర్లు ఎల్3 జాబితాలో ఉన్నట్లయితే అధికారులు ధృవీకరించి, వారికి ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపట్టాలని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల అనుమతులకు సంబంధించి క్షేత్ర స్థాయి ధృవీకరణ, గెజిటెడ్ ఆఫీసర్ ధృవీకరణ, డెస్క్ ధ్రువీకరణ ప్రక్రియలు పారదర్శకంగా చేపట్టి అర్హులకు ఇండ్లు అందేలా చూడాలన్నారు. అనంతరం కలెక్ట్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, వాగుల సమీపంలోకి పశు కాపరులు, మత్స్యకారులు, ఇతరులెవరూ వెళ్లకుండా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, హౌసింగ్ పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలిజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి.**

**నిర్మల్ కలెక్టరేట్: (మీడియా టుడే) జూలై 29, 2026**
రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాదు నుంచి బుధవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడువులోగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డిజిటలిజేషన్ ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా డిజిటలిజేషన్ చేపట్టాలన్నారు. ఎస్ఐఆర్ డిజిటలిజేషన్, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలపై జిల్లాల వారిగా సమీక్షించారు. ఒకే కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు ఉంటే, వారిని ఒకే పోలింగ్ కేంద్రం కిందకు వచ్చేలా రేషనలైజేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఈ వీసీలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో అన్ కలెక్టెడ్ ఫారములతో కలుపుకొని 98.6 శాతం ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన డిజిటలైజేషన్ వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వంద శాతం పూర్తయిందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా చేపడతామని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలు వెల్లడించడంతో పాటుగా.. వారి సందేహాలు నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఫార్మాసిటీ రైతులను ఇంకా ఎంతకాలం మోసం చేస్తారు

**ప్రభుత్వం, ఎమ్మెల్యే వైఖరిపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి విమర్శలు**



**ఇబ్రహీంపట్నం, జూలై 29 (మీడియా టుడే):** ఫార్మాసిటీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కాలయాపన చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ఆరోపించారు. అబద్ధాలు, ఉత్తుత్తి సమావేశాలతో రైతులను ఇంకా ఎంతకాలం మోసం చేస్తారని ప్రశ్నించారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఫార్మాసిటీ రైతుల సమావేశానికి సంబంధిత రైతులను, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులను పిలవకపోవడం మరోసారి రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. సమావేశాలు నిర్వహించడం కాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరారు. రైతుల అంగీకారం లేకుండా ఆన్‌లైన్‌లో తొలగించిన 2,500 ఎకరాల భూములను వెంటనే వారి పేర్లపై పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు కిలోమీటరు పరిధిలో పరిశ్రమలు ఏర్పాటు చేయబోమన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితో ఫార్మాసిటీ రైతులకు కేటాయించిన ప్లాట్లను ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా రిజిస్ట్రేషన్ చేయించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. రైతులు విసిగిపోయి ఆ ప్లాట్లను తక్కువ ధరలకు విక్రయించే పరిస్థితులు సృష్టించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.కందుకూరు మండలంలోని ముచ్చర్ల, మీర్‌ఖాన్‌పేట, సార్లరావులపల్లి, బేగరికంచ, అన్నోజిగూడ, పంజాగూడ గ్రామాల రైతులకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కృషితో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని, ఇక్కడి రైతులకు మాత్రం అదే పని చేయించలేకపోవడం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.ఇందిరమ్మ పేదలకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుంటుందని గతంలో విమర్శించిన నాయకులు, ఇప్పుడు మొండిగౌరెల్లి, కొత్తపల్లి, కుర్మిద్ద, మర్లకుంట తండా, ముచ్చర్ల గ్రామాల పేద రైతుల భూములను ఎందుకు స్వాధీనం చేసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని సత్తు వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. రైతుల భూములు తిరిగి ఇవ్వకపోతే రైతులు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు.

# ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది

**మంత్రి శ్రీధర్ బాబు -ప్రతి వ్యక్తిలో అపారమైన అంతరంగిక శక్తి దాగి ఉంటుంది: KLR**

**గురు పౌర్ణమి సందర్భంగా అల్మాస్‌గూడలో ఘనంగా పూజా కార్యక్రమాలు**



**బాలాపూర్ (మీడియాటుడే రిపోర్టర్ )జూలై 29 న్యూస్,**
గురు పౌర్ణమి సందర్భంగా +నవీజ ప్రశాంతిహిల్స్ డివిజన్ పరిధిలోని నందిహిల్స్ కాలనీలో శ్రీ దత్త సిద్ధాంతకర్త శ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ నివాసంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలోనూ, ప్రతి ఇంట్లోనూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నప్పుడే మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని, గురువుల ఆశీస్సులు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (ఖూ=) మాట్లాడుతూ, ప్రతి వ్యక్తిలో అపారమైన అంతరంగిక శక్తి దాగి ఉంటుందని, గురువుల మార్గదర్శకత్వంతో ఆ శక్తిని సత్ఫలితాల దిశగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లుతెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏలిమేటి అమరేందర్ రెడ్డి, సామిడి గోపాల్ రెడ్డి, మీర్‌పేట్, ప్రశాంతిహిల్స్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.అనంతరం మీర్‌పేట్, ప్రశాంతిహిల్స్ డివిజన్ల కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు, ఖూ=, దేప భాస్కర్ రెడ్డిలను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

# నర్సరీ యజమానులు నాణ్యమైన నారు అందించాలి

**జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య**



**సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: జూలై 29.**
సూర్యాపేట జిల్లాలో నారు విక్రయించే నర్సరీ యజమానులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి రైతులకు నాణ్యమైన నారు అందజేయాలనీ జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. బుధవారం సూర్యాపేట మండలం గాంధీనగర్ లో నెట్ హౌస్ లలో నారు పెంచుతున్న నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిరప, కూరగాయలు, బంతి నారు నర్సరీ అమ్మే యజమానులు ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందాలని అన్నారు. నాణ్యతలేని విత్తనాలతో నారు పెంచి విక్రయించవద్దని అలా చేసినట్లయితే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. నాణ్యతలేని నారు విక్రయించి రైతులను ఆర్థికంగా నష్టపరిచే నర్సరీ యజమానుల పైన ప్రభుత్వ పరంగా కఠిన చర్యలుతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం లో ఉద్యాన విస్తరణ అధికారి యారాల సుధాకర్ రెడ్డి, నర్సరీ యాజమాని అబ్దుల్ రహమాన్ ఉన్నారు.

# కుబీర్ మండల విద్యాశాఖలో అక్రమాలు

**ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి - ఉపాధ్యాయురాలు రెండేళ్లుగా పాఠశాలకు హాజరు కాకున్నా జీతం.**

**- అక్రమ డిప్యూటేషన్లతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టారని ఆరోపణ.**

**- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చాత్రా యువ సంఘర్ష సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ డిమాండ్.**



**భైంసా జూలై 29 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**

నిర్మల్ జిల్లా కుబీర్ మండల విద్యాశాఖలో అక్రమాలు, అవినీతి పెరిగిపోయాయని, మండల విద్యాధికారి నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయనిచాత్రా యువ సంఘర్ష సమితి (సి వై ఎస్ ఎస్) నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు పలు అంశాలను ప్రస్తావించారు. అరవింద్ మాట్లాడుతూ, కుబీర్ మండలంలోని కుప్టి ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన పరిణామాలు మండల విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. 2024లో కవిత అనే ఉపాధ్యాయురాలు ఆ పాఠశాలకు నియమితులైనప్పటికీ, అప్పటి నుంచి 2026 జూలై 29 వరకు ఒక్కరోజు కూడా విధులకు హాజరు కాకుండానే ప్రతి నెలా జీతం తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇంతకాలం ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఉండటం వెనుక మండల విద్యాధికారికి ముడుపులు అందాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. 2025--26 విద్యా సంవత్సరం ముగింపు సమయంలో తేదీ లేకుండా జిల్లా విద్యాశాఖాధికారి సంతకంతో అక్రమ డిప్యూటేషన్ ఉత్తర్వులు సృష్టించారని, ఇది మొత్తం వ్యవహారంలో ఉన్న అవకతవకలకు నిదర్శనమని అన్నారు. మండల విద్యాధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులు కలిసి నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం 2026 జనవరి 23న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ముందస్తు అనుమతి లేకుండా లేదా సెలవు మంజూరు కాకుండా విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టారని విమర్శించారు. రెండేళ్లుగా విధులకు హాజరు కాని ఉపాధ్యాయురాలిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విద్యాశాఖ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. కుప్టి ప్రాథమికోన్నత పాఠశాలలో 2025--26 విద్యా సంవత్సరం ప్రారంభంలో 56 మంది విద్యార్థులు ఉండగా, ఉపాధ్యాయుల కొరత, అక్రమ డిప్యూటేషన్లు, నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 35కు పడిపోయిందని తెలిపారు. పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు కలిపి ఎనిమిది నుంచి పది మంది విద్యార్థులు ఉండటంతో నిబంధనల ప్రకారం ఒక స్కూల్ అసిస్టెంట్ ఉండాల్సి ఉండగా, ఉన్న ఒక్క స్కూల్ అసిస్టెంట్‌ను కూడా అక్రమంగా డిప్యూటేషన్‌పై పంపించడం విద్యార్థుల చదువుకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. విద్యాశాఖ అధికారులు మరో ఉపాధ్యాయుడిని అడ్జస్ట్‌మెంట్ పేరుతో పంపించామని చెబుతున్నప్పటికీ, అది స్కూల్ అసిస్టెంట్‌కు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. కవిత అనే ఉపాధ్యాయురాలిని నియోజకవర్గాన్ని దాటి పెరి మండలంలోని పాఠశాలకు డిప్యూటేషన్ పేరుతో పంపించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తును పట్టించుకోకుండా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని, పేద విద్యార్థుల చదువును అంధకారంలోకి నెట్టేలా మండల విద్యాధికారి విజయ్‌కుమార్ వ్యవహరించారని విమర్శించారు. కుబీర్ మండలంలో ఇలాంటి ఘటనలు మరెన్నో తమ దృష్టికి వచ్చాయని, వాటిపై కూడా త్వరలో ఆధారాలతో బయటపెడతామని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే సమగ్ర విచారణ జరిపించి, మండల విద్యాధికారి విజయ్‌కుమార్‌తో పాటు బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సంఘర్షణ సమితి, యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షతో పాటు పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. గమనిక: పై వార్తలో పేర్కొన్న ఆరోపణలు సంఘర్షణ సమితి నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ చేసిన ఆరోపణల ఆధారంగా ఇవ్వబడ్డాయి. సంబంధిత అధికారుల స్పందన అందాల్సి ఉంది.

# మట్కా పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష



**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూలై 29 :**

మట్కా పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, మహారాష్ట్రకు చెందిన ఉమేష్ అనే వ్యక్తి మట్కా పేకాట ఆడిస్తున్నాడని తేలడంతో, అతనికి పట్టుకుని, అతనితో పాటు మిగిలిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆర్మూర్ కి చెందిన నాగేశ్వర్, ఉమేష్ తమ నేరము ఒప్పుకోవడంతో అరెస్ట్ చేయడమే కాకుండా వారి సెల్ ఫోన్ లను సీజ్ చేసి, నిందితులను కోర్టు ముందు హాజరు పరిచి జైలుకు పంపించడం జరిగింది. ఇకమీదట ఎవరైనా పేకాట లేదా మట్కా ఆడితే వారిపై కూడా ఇలాగే చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపుతామని ఆర్మూర్ టౌన్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

# పెద్దిరెడ్డి సూర్యారావుకు నివాళులు

**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**



సత్తుపల్లి కొత్తూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సూర్యారావు అనారోగ్య కారణంగా మరణించారు. ఈ రోజు వారి గ్రామం వారి నివాసం నందు దశదిన కర్మ జరిగింది .

ఈ కార్యక్రమంకు హాజరయ్యి వారి చిత్రపటానికి పూలు జల్లి నివాళులు అర్పించిన జిల్లా మున్నూరు కాపు ట్రస్టు బోర్డు అధ్యక్ష - కార్యదర్శులు కనకం జనార్దనరావు- కనిశెట్టి నర్సయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శెట్టి రంగారావు, జిల్లా అధ్యక్ష - కార్యదర్శులు శీలంశెట్టి వీరభద్రం - పసుపులేట్ దేవేందర్, జిల్లా కోశాధికారి మదూరు పూర్ణ చందర్ రావు, సత్తుపల్లి నాయకులు సుంకర వాసు, సారంగపాణి, జల్లేపల్లి మురళి మోహన్, తోట నాని , తోట కిరణ్, తోట మహేష్, ఆచంట నాగస్వామి మరియు దాసరి కుటుంబ రావుతదితరులు పాల్గొన్నారు..అనంతరం వారి కుమారులు పెద్దిరెడ్డి రామకృష్ణారావు, పురుషోత్తం లను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

# మెదక్ జిల్లాలో 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి



**మెదక్ మీడియా టుడే జూలై 29:**

మెదక్ జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 4,53,140 మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను 100 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 90 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మరో రెండు నుంచి మూడు రోజుల్లో 100 శాతం ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ కూడా కొనసాగుతోందని చెప్పారు. ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 1,200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న కేంద్రాలు, అలాగే 2 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి రేషనలైజేషన్ చేపడుతున్నట్లు తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు కేవలం నాలుగు నుంచి ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ఎలాంటి తప్పులు జరగకుండా ఈఆర్‌వోలు యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ రమాదేవి, సెక్షన్ సూపరింటెండెంట్ గఫార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన మహిళల సాధికారతకు నాటు కోళ్ల పంపిణీ

**జీవనోపాధి మెరుగుదలకు విఎన్ ఆర్ వి జే ఐ టి జిల్లాసంయుక్త కార్యక్రమం**

**హరిచంద్ తాండలో ఉత్సాహంగా నిర్వహించిన నాటు కోళ్ల పంపిణీ**



**మెదక్ జిల్లా.కౌడిపల్లి, జూలై 29 ( మీడియా టుడే)**

గిరి జన కుటుంబాల ఆర్థికాభివృద్ధి, మహిళల స్వయం ఉపాధి, గ్రామీణ జీవనోపాధి బలోపేతమే లక్ష్యంగా మెదక్ జిల్లా కౌడిపల్లి బ్లాక్ పరిధిలోని హరిచంద్ తాండ గ్రామ పంచాయతీలో సైన్స్, టెక్నాలజీ మరియు ఆవిష్కరణ కేంద్రం (ఎస్టిఐ హెచ్ యు బి) ఆధ్వర్యంలో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా ప్రాజెక్టు కింద విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వి ఎన్ ఆర్ వి జె ఐ ఈ టి సంస్థ పెరటి నాటు కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు సహ ప్రధాన పరిశోధకులు రాము మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో పెరటి నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి వి ఎన్ ఆర్ వి జె ఐ ఈ టి సంస్థ నిరంతరం అండగా నిలుస్తుందని, అవసరమైన శిక్షణ, సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పెరటి కోళ్ల పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే ఉపాధి మార్గమని, గ్రామీణ మహిళలకు ఇది ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీరేంద్ర గోపి, ప్రాజెక్టు సిబ్బంది డా. దత్తేష్, రాకేష్, రామకృష్ణ, గ్రామ సర్పంచ్ షాలిబాయి--రవీందర్, గ్రామ కార్యదర్శి సతీష్, గ్రామ పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడే ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# ఉపాధ్యాయులు సమర్ధ బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్. జూలై 29(మీడియా టుడే ప్రతినిధి):-**

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు సమర్థవంతమైన బోధనా పద్ధతులను అవలంబించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. బుధవారం దేవరకద్రలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పీహెచ్‌ఎస్)లో నిర్వహించిన మండల స్థాయి సమగ్ర సేవా-అంతర్గత ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడిన ఆయన, విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు పెంపొందించేలా బోధన సాగించాలని, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అనంతరం దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో జలసిరి, వీబీజీ--రామ్--జీతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు, ఫైనాన్స్ అసిస్టెంట్లు (ఎఫ్ఏలు), ఎగ్జిక్యూటివ్ కమిటీల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, లక్ష్యాల సాధన, నాణ్యతా ప్రమాణాలు, పెండింగ్ అంశాలను సమీక్షించిన ఆయన, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎం.పి.డి ఓ, ఎం.పి ఓ, ఏ.పి.ఎం, పంచాయతీ కార్యదర్శులు, ఫైనాన్స్ అసిస్టెంట్లు, ఎగ్జిక్యూటివ్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్‌లో వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ మీడియా టుడే జూలై 29:**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పలు కీలక సూచనలు చేశారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి, అందులో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని, వరద నీటిలో ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, అలాంటి ఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు నీటి మట్టాన్ని గమనిస్తూ అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని, వాహనదారులు భారీ వర్షాల సమయంలో అధిక వేగంతో ప్రయాణించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖలను అప్రమత్తం చేసి సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచిందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి సందర్భంగా మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**వినాయకపురంలో 60 మందిరక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన యువత**

**వీడియా టుడే భద్రాద్రి కొత్తగూడెం**
**అశ్వారావుపేట నియోజకవర్గం ప్రతినిధి మధు జులై 29**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో గురుపౌర్ణమి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని. ఉమా చంద్ర ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఘనవిజయం సాధించింది. వినాయకపురం గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకులు చిన్ననాటి నుండి వ్యవసాయ రంగంలో ఎంతో అనుభవాలి సేవా కార్యక్రమాల ప్రదాత బిర్రం వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో 60 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. ఈ రక్తదాన శిబిరానికి అశ్వారావుపేట ఏరియా హాస్పిటల్ ( ఏ హెచ్ ) మరియు భద్రాచలం ఏరియా హాస్పిటల్ ఏ హెచ్ కు చెందిన వైద్యులు, సిబ్బంది ప్రత్యేకంగా హాజరై శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని ముందుగా పరీక్షించి, రక్తపోటు, హిమోగ్లోబిన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మాత్రమే రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో డా. మౌనిక (ఎంఎస్--ఓబీజీ, ఆర్ఎంఓ), డా. గోపాలకృష్ణ (ఎంబీబీఎస్, సివిల్ అసిస్టెంట్), గణేష్ (ఎఫ్‌సీఏ), సిస్టర్ మేరీ సృజన, శిరీష (పీసీ), మహేష్ (అంబులెన్స్ డ్రైవర్), ఎడిల్టన్ దాలు (ల్యాబ్), ఎల్.టి. శ్రీనివాసరావు తదితర వైద్య సిబ్బంది శిబిరం మొత్తం దగ్గరుండి పర్యవేక్షిస్తూ రక్తదాతలకు వైద్య సేవలు అందించారు. వారి సేవలను గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. గురుపౌర్ణమి రోజున ఇంత పెద్ద ఎత్తున యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం గ్రామంలో ఆదర్శంగా నిలిచింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులు, గర్భిణీలు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు ఈ రక్తం ప్రాణాధారంగా నిలుస్తుందని వైద్యులు తెలిపారు. ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల ప్రసాద్, ఉప్పల మురళి, గ్రామ సర్పంచ్ కొవ్వాసి రాజు, లోకం సాంబశివరావు, మారుతి లక్ష్మణరావు, ఉప్పల నాగమహేశ్వరరావు, బిర్రం రాజేష్, బిర్రం ఉదయ్ కుమార్, లోకం అశ్విని, ఉప్పల సుదర్శన్‌రావు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు,



# ట్రాఫిక్ సిబ్బందికి హెల్మెట్ల పంపిణీ

**ప్రజలు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్లు ధరించాలి**

**ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్ రెడ్డి**




**ఇబ్రహీంపట్నం, జూలై 29 (మీడియా టుడే):**
ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ద్విచక్ర వాహనాలపై విధులు నిర్వహించే సమయంలో వినియోగించేందుకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చి. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐఎస్ఐ (ISI) ప్రమాణాల హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని, నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ ధరించడం అత్యంత అవసరమని తెలిపారు. హెల్మెట్ ధరించండి -- ప్రాణాలను కాపాడుకోండి. ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించండి అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రహదారులపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని కోరారు.

## నామ తల్లిదండ్రుల స్మృతి వనాన్ని సందర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
జమ్మూ & కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం పర్యటన లో భాగంగా రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న నామ ముత్తయ్య--వరమ్మ స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులు నామ ముత్తయ్య, వరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి, నామ ముత్తయ్య--వరమ్మ జీవిత విశేషాలు, సమాజానికి అందించిన సేవల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. అక్కడ ప్రదర్శించిన అరుదైన చిత్రాలను పరిశీలించారు. ఆ గ్యాలరీ ఫోటోల విశేషాలను నామ సోదరుడు సీతయ్య వివరించారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన మొక్కలను, పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ నుంచి హైదరాబాద్ పయనమయ్యారు.

## అంతర్జాతీయ పులుల దినోత్సవం : అడవుల పరిరక్షణతోనే పులులకు రక్షణ




**మీడియా టుడే జూలై 29 సారంగాపూర్:**
ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా సారంగాపూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జామ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ ఫారెస్ట్ డివిజనల్ అధికారి, నాగిని భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పులుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో వాటి కీలక పాత్ర, జీవవైవిధ్య పరిరక్షణలో పులుల అవసరాన్ని వివరించారు. అనంతరం ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, జామ్ సర్పంచ్ కరిపే రవళి,నజీర్ ఖాన్ ఉప అటవీ క్షేత్ర అధికారి, సారంగాపూర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల సంరక్షణ, అటవీ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## జడ్చర్ల నియోజకవర్గం ఓటర్లు జాబితా ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలి

**- జె.ఎల్.బి. హరిప్రియ**



**మహబూబ్‌నగర్. జూలై 29(మీడియా టుడే, ప్రతినిధి):-**
జడ్చర్ల శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులు 94.35 శాతం పూర్తయ్యాయని రెవెన్యూ అదనపు కలెక్టర్, జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు.బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ప్రజలు తమ ఎన్యూమరేషన్ ఫారాలను చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కల్పించాలని ఈఆర్ఓ కోరారు. గడువు సమీపించే సమయంలో పోర్టల్, మొబైల్ యాప్‌లపై అధిక రద్దీ ఏర్పడి ఫారాల సమర్పణలో జాప్యం ఏర్పడే అవకాశం ఉన్నందున ముందుగానే ఫారాలను సమర్పించాలని సూచించారు.ఈ సమావేశంలో జడ్చర్ల, మిడ్జిల్, రాజాపూర్, బాలానగర్, ఊర్కొండ మండలాల తహసీల్దార్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్, అదనపు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, అలాగే జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను భర్తరఫ్ చేయండి

**లేదంటే మోదీనే రాజీనామా చేయాలి- సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి డిమాండ్.**

**జంతర్ మంతర్ ఆందోళనలో విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం.**

**మార్పు కావాలి బిజెపి పోవాలి నినాదంతో ఆగస్టు 6నుంచి 15 వరకు పల్లేపల్లేకు సిపిఐ పాదయాత్రలు.**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాస్ రావు పిలుపు.**



**చిగురుమామిడి మండల రిపోర్టర్ మీడియా టుడే , జూలై 29**
నీట్ పేపర్ లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థులను మానసిక వేదనకు గురి చేసి విద్యార్థుల చావులకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలి లేదంటే ప్రధాన నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేయాలని సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రోజు హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం సిపిఐ నియోజకవర్గ నాయకులు నాగేల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై సమావేశం నాయకులను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి ప్రసంగి అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ లతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును బలి చేసారని నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలనీ అభిప్రాయపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన లో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ అమానుష్యమైన ఘటనపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సరైన సమయంలో స్పందించకపోవడం సరి కాదని చట్టాలు పాలకులకు చుట్టలైనయాని అభిప్రాయం వ్యక్తం చేశారు.దేశంలో మార్పు కావాలి బిజెపి గద్దే దిగి పోవాలనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు పల్లె పల్లెకు సిపిఐ పాదయాత్రలు జయప్రదం చేయుట కొసం ప్రజలు సహకరించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు నాయకులకు ప్రజలకు పిలుపునిచ్చారు. విలేఖరుల సమావేశంలో సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ, సిద్దిపేట జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్,కనుకుట్లశంకర్, నియోజకవర్గ సిపిఐ నాయకులు బొయిని అశోక్, గూడెం లక్ష్మి,ఉట్కూరి రాములు,బత్తుల బాబు,బాషబొయిన సంతోష్,తెరాల సత్య నారాయణ, జనగాం రాజ్ కుమార్, గాంభీరపు మధు,తొట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవ ట్రైన్ ది ట్రైనర్స్ కార్యక్రమానికి విశిష్ట సేవలు

**డా.ఎస్ఎల్ఎన్ టి శ్రీనివాస్‌ను సత్కరించిన టీటీడీ ఈఓ ఎం.రవిచంద్ర ఐఏఎస్**



**చిగురుమామిడి మండల రిపోర్టర్ మీడియా టుడే , జూలై 29**
శ్రీవారి సేవలో భాగంగా నిర్వహిస్తున్న 'ట్రైన్ ది ట్రైనర్స్' కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంలో విశిష్ట సేవలు అందించిన డా. ఎస్. ఎల్. ఎన్.టి. శ్రీనివాస్ ను తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి ఎం.రవిచంద్ర, ఐఏఎస్ తిరుమల సేవా సదన్‌లో మంగళవారం ఘనంగా సత్కరించారు.శ్రీవారి సేవకులు,గ్రూప్ సూపర్వైజర్లకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు సమగ్ర శిక్షణా రూపకల్పనలో డా.శ్రీనివాస్ విశేష కృషి చేశారు.శిక్షణా మాడ్యూల్స్ రూపకల్పన, ప్రామాణిక నిర్వహణ విధానాలు,రిపోర్టింగ్ ఫార్మాట్లు, సేవా ప్రాంతాల వారీగా విధులు--బాధ్యతల మార్గదర్శకాలు,నాయకత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు,క్షేత్రస్థాయి శిక్షణా విధానాల రూపకల్పనలో డాక్టర్ శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారు. ఈ 'ట్రైన్ ది ట్రైనర్స్' కార్యక్రమం ద్వారా నైపుణ్యం కలిగిన మాస్టర్ ట్రైనర్లను తయారు చేసి, వారి ద్వారా శ్రీవారి సేవకులకు ఆధ్యాత్మిక, విలువలు ,సేవాభావం ,క్రమశిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యం,సమన్వయ భావం,యాత్రికులకు ఉత్తమ సేవలు అందించే సామర్థ్యాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు.ఈ సందర్భంగా టీటీడీ ఈఓ శ్రీ రవిచంద్ర మాట్లాడుతూ డా.శ్రీనివాస్ అందించిన శిక్షణా నైపుణ్యం, దశాబ్దాల అనుభవం శ్రీవారి సేవ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు,కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ప్రశంసించారు. సత్కారానికి స్పందించిన డా. ఎస్. ఎల్. ఎన్. టి. శ్రీనివాస్ ఈ గౌరవాన్ని అందించిన టీటీడీ ఈఓ శ్రీ ఎం. రవిచంద్ర, ఐఏఎస్, ముఖ్య ప్రజాసంబంధాల అధికారి డా. రవి,టీటీడీ యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "మానవ సేవయే మాధవ సేవ" అనే మహోన్నత భావనతో, శ్రీవారి భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు శిక్షణా వ్యవస్థల అభివృద్ధికి తన వంతు సేవలను నిరంతరం కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

# మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కేజీబీవీలో అవగాహన కార్యక్రమం




**మీడియా టుడే :( 29 జూలై)**
**నిజామాబాద్ జిల్లా: బోధన్ మండలం:**
ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా సాధికారత కేంద్రం డి.హెచ్.ఇ డబ్ల్యు, మిషన్ శక్తి ఆధ్వర్యంలో బోధన్ మండలం అందాపూర్ గ్రామ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో "మోసాల మాటున చిక్కుకున్న బాధితులు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోధన్ సీడీపీఓ నందిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు, సోషల్ మీడియా మరియు ప్రేమ పేరుతో మోసగాళ్లు మహిళలు, యువతులు, చిన్నారులను టార్గెట్ చేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల మాటలు గుడ్డిగా నమ్మవద్దని, అనుమానాస్పద సంఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు లేదా హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా డిహెచ్ఈ డబ్ల్యు, మెషిన్ శక్తి డిఎంసి , స్వప్న మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా సమాజానికి పెద్ద ముప్పని తెలిపారు. విద్యార్థినులు సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, ఉద్యోగ, శిక్షణ ఆఫర్లను పూర్తిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అవసరమైనప్పుడు 1098, 181, 112, 100, 1930 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని కోరారు. బోధన్ సూపర్వైజర్ గోపి లక్ష్మి బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. ప్యారా లీగల్ వాలంటీర్ శ్రీమతి పద్మ సింగ్ మహిళలు, చిన్నారుల చట్టపరమైన హక్కులు, న్యాయ సహాయం గురించి వివరించారు. షీ టీమ్ ప్రతినిధి జయంతి సైబర్ మోసాలు, సోషల్ మీడియా నేరాల నుంచి రక్షణ చిట్కాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 300 మంది విద్యార్థినులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొని మానవ అక్రమ రవాణా నివారణపై ప్రతిజ్ఞ చేశారు.

# కుంటాలలో అనుమానాస్పద మృతి కేసు ఛేదన

**బాల నేరస్థుడు అదుపులో - సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు.**

**- మీడియా సమావేశంలో వెల్లడించిన భైంసా ఏఎస్పీ సాయి కిరణ్.**




**నిర్మల్ జూలై 29 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
నిర్మల్ జిల్లా కుంటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని దోనేల్లి గ్రామంలో జరిగిన అనుమానాస్పద మృతి కేసును పోలీసులు శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న బాల నేరస్థుడిని చట్ట ప్రకారం అదుపులోకి తీసుకున్నట్లు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ తెలిపారు.భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ వివరాల ప్రకారం, దోనేల్లి గ్రామానికి చెందిన పున్న మహేందర్ ఏప్రిల్ 18న గ్రామ శివారులోని బావిలో పడిపోయి మృతి చెందగా, ఏప్రిల్ 23న అతని మృతదేహం వెలికితీయబడింది. దీంతో కుంటాల పోలీస్ స్టేషన్‌లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194 కింద అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.తరువాత మృతుడి తల్లి జిల్లా ఎస్పీని ప్రజావాణి కార్యక్రమంలో కలిసి తన కుమారుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరడంతో, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసును ప్రత్యేక దృష్టితో అన్ని కోణాల్లో పునఃపరిశీలించారు. ఈ సందర్భంగా అనుమానితుల కదలికలు, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు.దర్యాప్తులో బాల నేరస్థుడు మహేందర్ బ్యాంకు ఖాతా నుంచి మోసపూరితంగా కొంత మొత్తాన్ని తన ఖాతాకు బదిలీ చేసుకున్నట్లు తేలింది. ఈ విషయమై మహేందర్ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదే కక్షతో బాల నేరస్థుడు మహేందర్‌ను దోనేల్లి గ్రామ శివారులోని బావి వద్దకు తీసుకెళ్లి వెనుక నుంచి తోసివేయడంతో అతడు బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.దర్యాప్తులో సేకరించిన విశ్వసనీయ సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా బాల నేరస్థుడి ప్రమేయం నిర్ధారణ కావడంతో బుధవారం అతడిని చట్ట ప్రకారం అదుపులోకి తీసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఏఎస్పీ తెలిపారు.ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన భైంసా రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, కుంటాల ఎస్ఐ నరేష్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందిని ఏఎస్పీ సాయి కిరణ్ అభినందించారు...

# ఈ దేశంలోని యువత, విద్యార్థులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వంచేస్తున్నదమనకాండను ప్రతిఘటించండి

**యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ పిలుపు**



**మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :**
జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా ఈ రోజు స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, 20 మండలాల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్ కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయికుమార్ మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటివరకు ముందుండి పోరాడారని, ఇదే పోరాట స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.దేశంలోని యువత, విద్యార్థుల గొంతును అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు.అదేవిధంగా, విద్యార్థి–యువజన ఉద్యమాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణలోకి తీసుకుని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని వేజండ్ల సాయికుమార్ హెచ్చరించారు.యువత సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ లు ఖలీల్, బాల గంగాధర్, కోటేష్, ఆదర్శ్ మరియు జిల్లా జనరల్ సెక్రటరీ లు కుక్కల మహేష్, బెల్లంకొండ శరత్ ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ శ్రావణ్, జిల్లా యువజనకాంగ్రెస్ నాయకులు బోడేపూడి రాజా, కొండూరి హృదయ్ కిరణ్ మరియు అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ లు అంబటి ఈశ్వర్, నితీష్ కుమార్ సన్నీ, ఖైసర్, ఫారుక్, జంగం రాజేష్ మరియు మండల అధ్యక్షులు జనప్రియ కుమార్, రామకృష్ణ, అలకుంట నరసింహారావు, రాకేష్, సతీష్, నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కో-కో ఆర్డినేటర్ పవన్ కుమార్ రాజు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి తరుణ్, దినేష్, మల్లెలి గాంధీ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి రాణించినప్పుడే విద్యా వ్యవస్థకు సార్థకత

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జిల్లా మీడియా టుడే, స్టాఫ్ రిపోర్టర్: జులై 29.**

సూర్యాపేట జిల్లాను విద్యా రంగంలో మరింత అగ్రపథాన నిలిపేందుకు ఉపాధ్యాయులు నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపా ధ్యాయులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ లో సూర్యాపేట జిల్లా ప్రజెంటేషన్లో మొదటి స్థానాన్ని సాధించడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ బృందాన్ని అభినందించారు. ఆ పాత పద్ధతులు వద్దు కొత్తగా బోధించండి ప్రపంచీకరణ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు అవసరాలను గుర్తించి తరగతి గది బోధన సాగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా.. కృత్యాధార బోధన, ప్రయోగాలు, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ను ఉపాధ్యాయులు సమర్థవం తంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. చదువుతో పాటు విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా పర్యవేక్షించడానికి ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తోటలో అన్ని పూలూ వికసించాలి ఒక తోటలోని కొన్ని మొక్కలు మాత్రమే పూలిస్తే ఆ తోటకు అందం రాదని అన్ని మొక్కలూ పూలు పూసి వికసిస్తేనే ఆ శోభనిస్తుందని, అలాగే క్లాస్ రూమ్‌లో కేవలం కొందరు విద్యార్థులు మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరూ రాణించి ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే విద్యా వ్యవస్థ అసలైన లక్ష్యం నెరవేరుతుందిని కలెక్టర్ ఉదాహరణతో వివరించారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలు సాధించేలా చూడాల్సిన పూర్తి బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని, జిల్లాను విద్యా రంగంలో మరింత మెరుగైన స్థానంలో నింపాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో కే. అశోక్, సెక్టోరియల్ అధికారులు హరికృష్ణ, రేణుక, సెంటర్ ఇంచార్జ్ నాగరాణి, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రీహరి శ్రవణ్, సత్యనారాయణ రెడ్డి, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఉపాధ్యాయుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

## టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమో లు కోటేశ్వరావు డిమాండ్

**మీడియా టుడే ఎర్రుపాలెం:**

తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్( టిఎస్ యుటిఎఫ్ )ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు,మండల ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశమై గురుకుల ఉపాధ్యాయుల బదిలీలను తక్షణమే నిర్వహించి కేడరీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, 010 ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని వెంటనే అమలు చేయాలని, విజ్ఞప్తి చేశారు.కాళీ పోస్టులను భర్తీ చేసి పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కేర్ టేకర్ ను నియమించాలని ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వాలని ,పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని, 317 ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు .రాష్ట్రంలో న్యాయమైన విద్యను అందించడంలో గురుకుల విద్యాలయాలు కీలకపాత్ర పోస్తున్న పోషిస్తున్నప్పటికీ అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సేవా పరిపాలన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గురుకుల విద్యాలయం రంగంలోని పనిచేసే ఉపాధ్యాయులు ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం వల్ల విద్య వ్యవస్థ పై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. గురుకుల విద్య వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారమే మొదటి అడుగని ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకపోతే టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో



రాష్ట్రవ్యాప్తంగా దశలవారిగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండలం ఉపాధ్యక్షులు నీలం సైదారావు, పిడి నాగేశ్వరరావు, సుబ్బరామరాజు, సత్యనారాయణ ,జీవన్, గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

# నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు

**దాదాపు రూ.15.22 కోట్ల పనులను ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్**

**వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన - ఆహ్లాదకరంగా సిద్ధమైన గుడి చెరువు బండ్ పార్క్**

**సిరిసిల్ల ఖ్యాతిని మరింత ఇనుమడించేలా వస్త్రం తయారీ దశల నమూనాలు - ఆకట్టుకుంటున్న మోడల్ బస్ స్టేషను**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే , జూలై 29 :**

జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పర్యటించ నున్నారు. దాదాపు రూ.15 కోట్ల 22 లక్షల నిధులతో పూర్తి చేసిన పనులను ప్రారంభించ నున్నారు. రూ. కోటి 65 లక్షలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో ఈ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యాయి. ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఈ పనులు జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత దోహదపడనున్నాయి.

**ఆహ్లాదకరంగా గుడి చెరువు బండి పార్క్**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంది. మహా శివుడి విగ్రహం మరింత ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ. 12 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ నిర్మాణ పనులు చేపట్టారు.గుడి చెరువు అభివృద్ధి పనులను గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆధ్యాత్మికత భావం ఉట్టిపడేలా, భక్తి భావం పెంపొందించేలా మహాశివుడి విగ్రహంతో పాటు, సప్తమాత్రికల విగ్రహాలు, అలాగే గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.బండ్ పార్క్ లో నటరాజ్ స్టాచ్యూ ఫౌంటెన్, సూర్య నమస్కార్, వాకింగ్ ట్రాక్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్,ల్యాండ్ స్కేప్, అంఫ్లీ థియేటర్, తదితర పనులు పూర్తి చేసి ఆకర్షణీయ మొక్కలు నాటారు.

**సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటేలా.. ప్రత్యేక ఆకర్షణగా రగుడు బై పాస్ జంక్షన్**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత చాటేలా వస్త్ర ఉత్పత్తి దశలు అందరికీ అర్థం అయ్యేలా ఏర్పాటు చేసిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు, వివిధ ప్రాంతాల ప్రజలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలను తెలుసుకునేలా ఏర్పాటు చేసిన నమూనాలపై హర్షం వ్యక్తం అవుతుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పనులను పలుమార్లు పరిశీలించి వేగంగా.. ఆకర్షణీయంగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఇరువైపులా రోడ్డును విస్తరింపజేశారు. అలాగే రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా సైన్ బోర్డ్స్ ఇతర భద్రతా చర్యలు తీసుకోవాలని రోడ్డు సేఫ్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. రూ. 3 కోట్ల 10 లక్షలతో రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ లో భాగంగా బీటీ రోడ్డు విస్తరణ, హై మాస్ట్ లైట్లు, గ్రీనరీ, రోడ్డు భద్రత చర్యలు, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ లో వివిధ దశల నమూనాలు సిద్ధం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా జోట (నాడే) నిలుస్తుంది.

**మోడల్ బస్ షెల్టర్స్**

ప్రయాణికులు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం, ఎస్పీ కార్యాలయం ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రగుడు బై పాస్ జంక్షన్ వద్ద కరీంనగర్ రోడ్డులో.. కామారెడ్డి రోడ్డులో రూ. 12.50 లక్షలతో మోడల్ బస్ షెల్టర్స్ సిద్ధం చేశారు. అందరికీ ఎంతో ఉపయోగకరంగా అందుబాటులో ఉంది.

**నేడు వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం**


కోటి 65 లక్షల రూపాయలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆఫీసు రూమ్స్, బస్ స్టాండ్ ఆవరణ సుందరీకరణ, పచ్చదనం పెంపు తదితర పనులు చేయనున్నారు.

# మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు ప్రశాంతం

## అధ్యక్షుడిగా నర్సింహచారి, కార్యదర్శిగా సంగమేశ్వర్ విజయం

**మెదక్ మీడియా టుడే , జూలై 29:**

మెదక్ ప్రెస్ క్లబ్ 2026--28 సంవత్సరాల పాలకవర్గ ఎన్నికలు మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొత్తం 98 మంది ఓటర్లలో 96 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుని ఎన్నికలను విజయవంతం చేశారు.సీనియర్ జర్నలిస్టులు బాలేశ్వర్, దేవయ్య, శ్రీధర్,, ఫారూక్, ఖయ్యాం, హరినాథ్, శంకర్ దయాల్ చారి, రాజా గౌడ్, గోపాల్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి రవికుమార్ గౌడ్, రాజశేఖర్ గౌడ్ తో పాటు ఇతర జర్నలిస్టులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అధ్యక్ష పదవికి గుట్టమీది ప్రకాష్, శివన్నగారి నర్సింహచారి మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. ఓట్ల లెక్కింపులో ప్రకాష్‌కు 42 ఓట్లు రాగా, నర్సింహచారికి 54 ఓట్లు లభించాయి. దీంతో 12 ఓట్ల మెజార్టీతో శివన్నగారి నర్సింహచారి అధ్యక్షుడిగా విజయం సాధించారు.ప్రధాన కార్యదర్శి పదవికి చెవిటి అశోక్, బచ్చు సంగమేశ్వర్ పోటీ పడగా, అశోక్‌కు 44 ఓట్లు, సంగమేశ్వర్‌కు 52 ఓట్లు వచ్చాయి. దీంతో 8 ఓట్ల మెజార్టీతో బచ్చు సంగమేశ్వర్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నర్సింహచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌లకు విజేత ధ్రువపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.




# ఇన్‌స్పైర్-2026తో స్ఫూర్తి నింపిన తెలంగాణ పబ్లిక్ స్కూల్

**గురుపూర్ణిమ వేడుకల్లో ఘనంగా ఉపాధ్యాయుల సన్మానం**

**విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేసిన మల్‌రెడ్డి యువశక్తి**

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అభిషేక్ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, జూలై 29 (మీడియా టుడే):**

గురుపూర్ణిమ సందర్భంగా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో, రాష్ట్ర యువ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి సారథ్యంలో నిర్వహించిన "ఇన్‌స్పైర్-2026" కార్యక్రమం స్ఫూర్తిదాయక వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు హాజరయ్యారు.జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో వందేమాతరం, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన అనంతరం విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలు అందించారు.పాఠశాలలో సుమారు రెండు వేల మంది విద్యార్థులు ఉండగా, కార్యక్రమంలో దాదాపు 1,200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర సుమారు గంటన్నరపాటు ఏకధాటిగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.లక్ష్యసాధన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమయపాలన, తల్లిదండ్రులు--గురువుల పట్ల గౌరవం వంటి అంశాలను సరళమైన ఉదాహరణలతో వివరించారు. ఆయన ప్రసంగానికి విద్యార్థులు చప్పట్లతో స్పందించగా, సభామందిరం ఉత్సాహంతో మార్మోగింది.విద్యార్థులతో ప్రమాణం చేయించి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సామాజిక బాధ్యతతో విద్యార్థుల భవిష్యత్తు కోసం "ఇన్‌స్పైర్-2026" కార్యక్రమాన్ని నిర్వహించిన మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డిని ఆకెళ్ల రాఘవేంద్ర అభినందించారు.కార్యక్రమ నిర్వహణలో కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రశంసించారు.గురుపూర్ణిమ సందర్భంగా పాఠశాలకు చెందిన 60 మందికి పైగా ఉపాధ్యాయులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో భాగంగా రెండు వేల మందికి పైగా విద్యార్థులకు జ్యామెట్రీ బాక్సులు, వాటర్ బాటిల్స్‌తో పాటు విద్యాసామగ్రిని ప్రోత్సాహకంగా పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విద్యార్థులతో కలిసి పాఠశాల డైనింగ్ హాల్‌లో మధ్యాహ్న భోజనం చేశారు.విద్యార్థులకు అందుతున్న ఆహార నాణ్యత, మెనూ గురించి ఆరా తీసిన ఆయన, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు గిరిధర్‌కు సూచించారు. కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో స్ఫూర్తిని నింపుతూ విజయవంతంగా ముగిసింది.

# ఆకస్మిక తనిఖీలో నేరేడుచర్ల పీహెచ్‌సీ సేవలపై జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రశంసలు



**నేరేడుచర్ల, మీడియా టుడే రిపోర్టర్: జూలై 29.**

నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (గ్రాఎజ) జిల్లా ప్రోగ్రాం అధికారి డా.ప్రసిద్ధి గారు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు, లేబర్ రూమ్, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. పీహెచ్‌సీలో ఈ రోజు సాధారణ ప్రసవం ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చిన దేవిని ప్రత్యేకంగా పలకరించి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసు కున్నారు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవ సేవలు అందిస్తున్న వైద్యురాలు డా. పున్న నాగిని, నర్సింగ్ అధికారులు మరియు సిబ్బందిని అభినందించారు. ప్రసూతి తల్లులకు నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన మందులు, పోషకాహారం మరియు ప్రసవానంతర సంరక్షణను ఎలాంటి లోటు లేకుండా అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రోగులతో ఆప్యాయంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచేలా పనిచేయాలని సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా సి హెచ్ ఓ సల్వాది శ్రీనివాస్ ఆసుపత్రిలో అందిస్తున్న సేవల వివరాలను జిల్లా ప్రోగ్రాం అధికారికి వివరించారు. నేరేడుచర్ల పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న మెరుగైన వైద్య సేవలతో ప్రజలు విశ్వాసంతో ముందుకు వస్తుండడం సంతోషకరమని డా. ప్రసిద్ధ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో నర్సింగ్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఏ ఎన్ ఎం సునీత, ఆశా యశోద,జ్యోతి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రామాపురం గ్రామంలో శ్రీ స్వయం విభూది సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించినారు



చిలుకూరు జులై 29 మీడియా టుడే రిపోర్టర్ చిలుకూరు మండలం రామాపురం గ్రామాల్లోని శ్రీ స్వయం విభూతి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు తెల్లవారుజాము నుంచే భక్తిశ్రద్ధలతో గుడికి చేరుకొని పూజలు పుష్కరాలు పెద్ద ఎత్తున నిర్వహించినారు అనంతరం సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి సాయి సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వేమూరి వెంకట్రామ్మ భక్తులు, అర్చకులు, భక్తులు గ్రామపెద్ద ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు

మీడియా టుడే
గురువారం, జూలై 30, 2026

## అంగన్‌వాడీ పోస్టులకు భారీ స్పందన.. 5 పోస్టులకు 186 దరఖాస్తులు

మెదక్ జిల్లా మీడియా టుడే జూలై 29



మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించిందని మెదక్ సీడీపీఓ వెంకటరమణమ్మ తెలిపారు. మెదక్ పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వెరిఫికేషన్‌లో మొత్తం 5 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేయగా, 38 మంది వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. అలాగే పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది తమ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైనట్లు సీడీపీఓ వెల్లడించారు. భర్తీ చేయనున్న పోస్టుల్లో కొల్చారం మండలంలోని రంగంపేట--2, కొంగోడ్ సెంటర్--2, పాపన్నపేట మండలంలోని కొత్తపల్లి సెంటర్--2, అర్కెల సెంటర్--2, లక్ష్మీనగర్ తండా అంగన్‌వాడీ కేంద్రం పోస్టులు ఉన్నాయని వెంకటరమణమ్మ తెలిపారు.

## నల్లబండగూడెం సాయి మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



కోదాడ, జూలై 29 (మీడియా టుడే)-: మండల పరిధిలోని నల్లబండగూడెం రామాపురం క్రాస్ రోడ్డు మీద వేంచేసియున్న సాయిబాబా మందిరంలో దేవాలయ చైర్మన్ నల్లపాటి నరసింహారావు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం ఘనంగా వేద పండితులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోదాడ శాసన సభ్యురాలు నలమాధ పద్మావతి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయిబాబా దయవలన రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు పడి రైతులు పాడిపంటలతో సుఖశాంతులతో వర్ధిల్లాలి బాబా ఆశీర్వదించాలని బాబా అని కోరారు దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి అందిస్తానని ఆమె తెలిపారు పెద్ద ఎత్తున తరలివచ్చిన నల్లబండగూడెం చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల ప్రజలకు ఆమె గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించిన చైర్మన్ నల్లపాటి నరసింహారావును అభినందించారు ఈ సందర్భంగా దాతల సహకారంతో దేవాలయ కమిటీ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్రని కుసుమ వెంకటరత్నం బాబు వైస్ చైర్ పర్సన్ మల్లేశ్వరి డిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు కోదాడ మున్సిపల్ మాజీ చైర్పర్సన్ స్వామినేని ప్రమీల నల్లబండగూడెం సర్పంచ్ రావుల భవాని సర్వేశ్వరరావు మాజీ సర్పంచ్ ముంద్రా రంగారావు. మాజీ ఎంపీపీ మల్లెల రాణి క్షత్రియ వీధిలాపురం శ్రీను బట్టు పూర్ణ శ్యాము సుధాకర్ రామచంద్రావు గురవయ్య ఎన్ఆర్ఐ అనన్య డాటర్ ఆఫ్ వెంకన్న గౌడ్ మాజీ ట్రాఫిక్ ఎస్ఐ ప్రత్యేకంగా సింగపూర్ నుండి బాబా మీద అభిమానంతో వచ్చిన వెంకట్ కుమార్తెలు వేద పండితులు సాయి శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు తదితరులు పాల్గొన్నారు

## వంద శాతం సర్ ప్రక్రియ పూర్తి



రాయికల్-మీడియా టుడే-జూలై 29: రాయికల్ మండల వ్యాప్తంగా సర్ ప్రక్రియ వంద శాతం పూర్తయిందని తహసీల్దార్ నాగార్జున తెలిపారు. సర్ ను తొందరగా పూర్తిచేసిన సిబ్బందిని అభినందించారు. రాయికల్ మండలం జగిత్యాల నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ వంద శాతం పూర్తి చేసిన తొలి మండలంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో స్వీట్లు పంచి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ కుమార్, ఆర్ఐ దేవాదాసు, బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాక్షాత్తు దేవుడికే సవాల ?

### ముంగిమల్ల గ్రామం అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణంపై రాజకీయాలా?

మీడియా టుడే వార్తలు: కొడంగల్ నియోజకవర్గం

ముంగిమల్ల గ్రామం ,కోస్గి మండలం, నారాయణపేట జిల్లా, కొడంగల్ నియోజిక వర్గంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారిచే అవసరమైన అన్ని పరిపాలనా అనుమతులు లభించి, నిధులు కూడా మంజూరయ్యాయి. గ్రామస్థులు చెబుతున్నప్పటికీ, ఆలయ నిర్మాణ పనులుకు ఇప్పటికీ గత తొమ్మిది నెలలుగా ఎదురుచుస్తున్నా శంకు స్థాపన కాకపోవడము భక్తుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. గ్రామస్థులు, భక్తుల ఆరోపణల ప్రకారం రాజకీయ జోక్యమే ఆలయ నిర్మాణంలో జాప్యానికి ప్రధాన కారణంగా మారిందని పేర్కొంటున్నారు. రాజకీయ విభేదాల కారణంగా దేవాలయ నిర్మాణం నిలిచిపోవడం దురదృష్టకరమని, భక్తి విశ్వాసాలకు రాజకీయాలు అడ్డంకిగా మారకూడదని వారు అభిప్రాయపడుతున్నారు. ఆలయ నిర్మాణానికి అన్ని అనుమతులు, నిధులు ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగకపోవడాన్ని కొందరు భక్తులు "ఇది స్వయంగా ఆంజనేయస్వామికే విసిరిన సవాలు"గా అభివర్ణిస్తున్నారు. అయితే, నిర్మాణం ఆలస్యానికి గల కారణాలు స్వతంత్రంగా నిర్ధారించబడలేదు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని, రాజకీయాలకు అతీతంగా స్పందించి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్థులు, భక్తులు తెలంగాణ ప్రభుత్వముతో విజ్ఞప్తి చేస్తున్నారు.


వార్తా విలేఖరి:
ఎం. పురుషోత్తం (తెలంగాణ)



## ఇటిక్యాలలో గురు పౌర్ణమి వేడుకలు



రాయికల్-మీడియా టుడే-జూలై 29: రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని సాయిబాబా దేవాలయంలో బుధవారం సాయప్ప ట్రస్ట్ అధినేత చెన్నమనేని నివేదిత.. ట్రస్ట్ వైస్ చైర్మన్ హిమవంతరావు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పండితులు శివశంకర్ శర్మ బృందం గణపతి పూజ, పుణ్యాహవచనం, సాయిబాబాకు అష్టోత్తర శత కలశ స్నపనం, అభిషేకాలు, అర్చనలు హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ జెడ్పి చైర్పర్సన్ దావ వసంత సురేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సమితి కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు, మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, మహిళలు యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వడలో బొద్దింకలు

**ఆందోళన చెందుతున్న వినియోగదారులు**

**ఇది ఏంటని ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు**

**ఫుడ్ ఇన్స్పెక్టర్ దృష్టిసరించాలంటున్న బాధితులు**



జగిత్యాల మీడియా టుడే- జూలై 29

జగిత్యాల పట్టణంలోని హోటల్లు, బేకరీలు, రెస్టారెంట్లు లలో రోజురోజుకు శుచి శుభ్రత అనేది కరువైంది.. నిత్యం ఏదో ఒక హోటల్లో అల్పాహారాలలో ఈగలు, బొద్దింకలు దర్శనమియ్యడం సాధారణ విషయం గా మారింది..ఎన్నిసార్లు వినియోగదారులు ఫిర్యాదులు చేసిన , అధికారులు తనిఖీలు చేసిన నిర్వాహకుల తీరు మారడం లేదు..పట్టణంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో తినే అల్పాహారం, భోజనం, స్వీట్లలో ఏదో ఒక పదార్థంలో ఈగలు దోమలు రావడం సర్వసాధారణ విషయంగా జగిత్యాల పట్టణ ప్రజలు భావిస్తున్నారు..వివరాల్లోకి వెళితే యావర్ రోడ్డు లో గల టిఫిన్ సెంటర్లలో అల్పాహారాలను విక్రయిస్తున్నారు. ..సాయంత్రం వేళ అలసిపోయి ఏమైనా తిందామని బయటకి వెళ్ళిన భోజన ప్రియులకు తినే వాటిలో ఈగలు దోమలకు తోడు బొద్దింకలు కూడా జత కడుతున్నాయి. .వినియోగదారుడు శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న దోష సెంటర్లో ఒక ప్లేట్ ఇడ్లీ, ప్లేట్ వడ ఇంటికి పార్సెల్ తీసుకెళ్లగా వడ తిందామని ప్యాకెట్ విప్పగా వడలతో బొద్దింకలు కూడా దర్శనమిచ్చాయి..ఇదేంటని నియోగదారుడు దోష సెంటర్ యజమాని నీ ప్రశ్నించగా ఏం చేయమంటావని , వర్షాకాలం పురుగులు వస్తాయని దురుసుగా సమాధానం చెప్పాడు..విషయాన్ని ఫుడ్ ఇన్స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని బాధితుడు వాపోయాడు. ..ఇకనైనా సంబంధిత అధికారులు దృష్టిసరించి హోటళ్లపై తగు చర్యలు తీసుకోవాలని జగిత్యాల పట్టణ ప్రజలు కోరుతున్నారు..

## నిండిన చెరువు....దూకుతున్న మత్తడి



రాయికల్-మీడియా టుడే-జూలై 29: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాయికల్ మండల వ్యాప్తంగా చెరువులకు, కుంటలకు జల కళ వచ్చింది. పట్టణంలోని పెద్ద చెరువు నిండి మత్తడి దూకుతుంది. వర్షాలు లేక అందోళన చెందిన రైతులు...నిండు కుండల ఉన్న చెరువును చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాయికల్-రామాజిపేట వంతెన పూర్తి అయిన అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో వాహనలు బురదలో చిక్కుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాయికల్-మైతాపూర్ హై లెవల్ వంతెన పనులు పూర్తి కాకపోవడంతో రోడ్డుపై వరద ప్రవాహం ఉండటంతో బస్సు రాకపోకలు నిలిచిపోయాయి. సింగరావుపేట లో లెవెల్ వంతెనపై నుంచి నీటి ప్రవాహం ఎక్కవ ఉండటంతో రాయికల్-జగిత్యాల బస్సు రాకపోకలు నిలిపివేశారు. తహశీల్దార్ నాగార్జున, ఎస్సై సుధీర్ రావులు వంతెనల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు.



# రోడ్డుపై పడిన చెట్టును ఢీకొని యువకుడు మృతి

**నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన మనోజ్ కుమార్**

**రామంతాపూర్‌లో విషాద ఘటన.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**

ఉప్పల్, జూలై 29 ( మీడియా టుడే ప్రతినిధి): రామంతా పూర్‌లో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టును గుర్తించలేక ద్విచక్ర వాహనంతో ఢీకొన్న ఓ యువకుడు నాలుగు రోజుల పాటు చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబంలో ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడైన పెంద్ర మనోజ్ కుమార్ (25) కాన్సెంట్రిక్స్ లాజిస్టిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ రామంతాపూర్‌లోని కేసీఆర్ నగర్‌లో అద్దె గదిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి విధులు ముగించుకుని ఏపీ 36 ఏక్యూ 2889 నంబర్ గల ద్విచక్ర వాహనంపై తన గదికి వెళ్తుండగా, అర్ధరాత్రి 12.10 గంటల సమయంలో రామంతాపూర్ దేవేందర్ నగర్ రోడ్డులోని ఇండస్ట్రియల్ ఏరియా సమీ పంలో రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టును గుర్తించలేక వాహనం ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోవడంతో తల వెనుక భాగంలో తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి మొబైల్ ఫోన్ ద్వారాసమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యులు అతడి మెదడుకు తీవ్ర గాయమై రక్తం గడ్డకట్టినట్లు తెలిపారు. అనంతరం ఐసీయూలో చికిత్స అందించినప్పటికీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఈ నెల 28వ తేదీ ఉదయం 11.40 గంటలకు మనోజ్ కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు విధుల్లో ఉన్న వైద్యులు నిర్ధారించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఇంకా ఐదు రోజులే గడువు.. ఎస్ఐఆర్‌పై అప్రమత్తం కావాలి

**రాజకీయ పార్టీల సహకారంతో ప్రక్రియ పూర్తి చేయాలి: ఆర్‌డీఓ నల్ల వెంకట్ రెడ్డి**

**మేడ్చల్ నియోజకవర్గంలో 81.92% డిజిటైజేషన్ పూర్తి**



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 29 (మీడియా టుడే): ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఇంటింటి సర్వే పూర్తి చేసేందుకు ఇంకా ఐదు రోజులే గడువు ఉన్నందున రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని కీసర ఆర్‌డీఓ, ఎన్నికల నమోదు అధికారి నల్ల వెంకట్ రెడ్డి కోరారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు వివరాల డిజిటైజేషన్ ఇప్పటికే 81.92 శాతం పూర్తయిందని తెలిపారు. బుధవారం కీసర రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం జూలై 15న సవరించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఆగస్టు 3 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆగస్టు 10న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, అదే రోజు నుంచి సెప్టెంబర్ 9 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. వాటి పరిశీలన అనంతరం అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో డిజిటైజేషన్ 81.92 శాతం పూర్తయిందని పేర్కొన్న ఆయన, మిగిలిన ప్రక్రియను గడువులోగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామా మార్పులు, మరణించిన వారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి పేర్ల తొలగింపు ఎన్నికల సంఘం నిబంధనల మేరకే జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా రాజకీయ పార్టీలు ప్రజల్లో అవగాహన కల్పించి ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని ఆర్‌డీఓ కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని పలు సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103